అక్రమ మద్యం వరద..!

అడ్డదారుల్లో జిల్లాలోకి ప్రవేశం



- 8 నెలల్లో 18,447 లీటర్లు సీజ్
- నాటుసారా, బెల్టు దుకాణాల మద్యం అదనం
- 3,121 కేసులలో 3,012 మంది అరెస్టు..
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 280 వాహనాలు సీజ్

అక్రమ మద్యం సరిహద్దులు దాటొస్తోంది. సుంకం కట్టని మద్యం (ఎన్‌డీపీఎల్) కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వరదలా వస్తోంది. ఎనిమిది నెలల వ్యవధిలోనే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోకి ఏకంగా 13 వేల లీటర్ల పైచిలుకు అక్రమ మద్యం ప్రవేశించిందంటే ఏస్థాయిలో దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇది అధికారులకు పట్టుబడినదే. పట్టుబడని మద్యం ఇంతకు చాలా రెట్లు ఎక్కువగా ఉండొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టుల్లో భారీగా అక్రమ మద్యం పట్టుబడుతోంది. సరిహద్దు మండలాల్లో నాటుసారా పెద్దఎత్తున కాస్తున్నారు. బెల్టుషాపులు సైతం వెలిశాయి. గతేడాది సెబ్‌ను రద్దు చేయడంతో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దాడులు చేశారు. పన్ను చెల్లించని మద్యం, నాటుసారా, బెల్టు దుకాణాల్లో 18,447 లీటర్లు పట్టుకుని, సీజ్ చేశారు. 3 వేల పైచిలుకు కేసులు పెట్టారు. మూడువేల మందికిపైగా అక్రమ మద్యం తరలిస్తున్న వారిని అరెస్టు చేశారు.

- అనంతపురం క్రైం, (ఆంధ్రజ్యోతి)

అక్రమ మద్యం సరిహద్దులు దాటొస్తోంది. సుంకం కట్టని మద్యం (ఎన్‌డీపీఎల్) కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి వరదలా వస్తోంది. ఎనిమిది నెలల వ్యవధిలోనే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోకి ఏకంగా 13 వేల లీటర్ల పైచిలుకు అక్రమ మద్యం ప్రవేశించిందంటే ఏస్థాయిలో దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇది అధికారులకు పట్టుబడినదే. పట్టుబడని మద్యం ఇంతకు చాలా రెట్లు ఎక్కువగా ఉండొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టుల్లో భారీగా అక్రమ మద్యం పట్టుబడుతోంది. సరిహద్దు మండలాల్లో నాటుసారా పెద్దఎత్తున కాస్తున్నారు. బెల్టుషాపులు సైతం వెలిశాయి. గతేడాది సెబ్‌ను రద్దు చేయడంతో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దాడులు చేశారు. పన్ను చెల్లించని మద్యం, నాటుసారా, బెల్టు దుకాణాల్లో 18,447 లీటర్లు పట్టుకుని, సీజ్ చేశారు. 3 వేల పైచిలుకు కేసులు పెట్టారు. మూడువేల మందికిపైగా అక్రమ మద్యం తరలిస్తున్న వారిని అరెస్టు చేశారు.

సరిహద్దులోనే ఎక్కువ

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు కర్ణాటకతో ఎక్కువభాగం సరిహద్దును పంచుకుంటున్నాయి. సరిహద్దు మండలాల గుండా భారీగా అక్రమ మద్యం జిల్లాలోకి ప్రవేశిస్తోంది. డీ హిరేహాళ్, కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, మడకశిర, అమరాపురం, రొళ్ల తదితర మండలాల గుండా కర్ణాటక తదితర ప్రాంతాల నుంచీ మద్యం వస్తోంది. టూవీలర్లు, ప్రత్యేక వాహనాల్లో వీటిని తీసుకొస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాటుసారా సైతం కాస్తున్నారు. గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, కంబదూరు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం స్టేషన్ల పరిధిలో నాటుసారా తయారవుతోంది. సెబ్ రద్దు తర్వాత గతేడాది అక్టోబరు 15 నుంచి ఈ ఏడాది జూలై చివరి వారం వరకూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో భారీగా దాడులు చేశారు. డొనేకల్లు, విడపనకల్లు, ఓబుళాపురం, తూముకుంట, కొడికొండ చెక్ పోస్టుల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, మడకశిరలో ఉన్న బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు సైతం తనిఖీలు చేస్తున్నాయి. ఫలితంగా పన్ను చెల్లించని మద్యం 13,534 లీటర్లు సీజ్ చేసి, 1,516 కేసులు కట్టారు. 1,568 మందిని అరెస్టు చేయడంతోపాటు 185 వాహనాలు సీజ్ చేశారు. 2,580 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సుమారు 82,235 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా రవాణా చేస్తున్న 18 వాహనాలు సీజ్ అయ్యాయి. బెల్టు దుకాణాలకు అక్రమంగా తరలిస్తున్న 2,333 లీటర్ల మద్యం సీజ్ చేయడంతోపాటు 990 కేసులు నమోదు చేశారు. వీటి పరిధిలో 996 మందిని అరెస్టు చేశారు. ఈ కేసుల్లో 77 వాహనాలను (మిగతా 6లో..)

మీ పింఛన్‌కు మాదీ పూచీ..!

దివ్యాంగ పింఛన్‌దారులే టార్గెట్

వెరిఫికేషన్‌కు వెళ్లే వారి నుంచి వసూళ్లు

పుట్టుకొచ్చిన దళారులు

పుట్లూరు మండలంలోని ఓ పంచాయతీకి చెందిన వ్యక్తి.. సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానంటూ రూ.20 వేలు వసూలు చేశాడు. నెలలు గడిచినా సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో సదరు పింఛన్‌దారుడు.. ఆ వ్యక్తితో వాగ్వాదానికి దిగాడు. అతడి ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. తన డబ్బులు ఇచ్చి ట్రాక్టర్ తీసుకెళ్లాలని తెగేసి చెప్పాడు.

మండలంలోని మరో గ్రామంలో ముగ్గురి దివ్యాంగ పింఛన్లు కాపాడతానంటూ ఒక్కొక్కరి నుంచి ఓ దళారి రూ.30వేలు చొప్పున రూ.90వేలు వసూలు చేసి, చేతులెత్తేశాడన్న ఆరోపణలు ఉన్నాయి.
ఇంకో గ్రామంలో ఏకంగా సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానంటూ ఆర్‌ఎంపీ దుకాణం తెరిచాడన్న ప్రచారం జరుగుతోంది.

పుట్లూరుకు ఐదు కిలోమీటర్ల దూరంలోని గ్రామంలో పింఛన్ పోకుండా కాపాడాలంటే ముందుగానే డబ్బు ఇవ్వాలని దళారీ చెప్పాడట. వచ్చేనెల పింఛన్ డబ్బులు వస్తే అప్పుడు నిలబెట్టినట్లు నమ్మి, డబ్బు ఇస్తామంటూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.



యాడికి/పుట్లూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ల పునఃపరిశీలనను క్యాష్ చేసుకునేందుకు దళారులు పుట్టుకొచ్చారు. పింఛన్ పోకుండా కాపాడతామంటూ లబ్ధిదారులను నమ్మబలుకుతున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తామంటూ కూడా డబ్బులు గుంజుతున్నారని తెలుస్తోంది. యాడికి, పుట్లూరు మండలాల్లో పింఛన్‌దారులనే టార్గెట్‌గా చేసుకుని (మిగతా 6లో...)

వైసీపీ దోపిడీ రూ.11 కోట్లు..!

- మున్సిపాలిటీ పన్ను వసూళ్లలో మాయాజాలం
- ఖజానాకు జమ చేయకుండా జేబుల్లోకి..
- రెవెన్యూ సర్వేలో బహిర్గతం
- 2,532 భవనాల్లో అక్రమాల గుర్తింపు



సర్వే నివేదికను నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామికి అందజేస్తున్న ఆర్‌ఓ లక్ష్మీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో వైసీపీ పాలకులు దోపిడీ సాగించారు. ఐదేళ్లూ పన్ను వసూళ్లలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయం సర్వేలో బహిర్గతమైంది. ఉమ్మడి అనంత జిల్లాలోని నగర పాలక సంస్థ, 11 మున్సిపాలిటీల్లో ఏకంగా రూ.11 కోట్లు జేబుల్లోకి వేసుకున్నట్లు తేలింది. 2,532 భవనాల నుంచి వసూలు చేసిన పన్నులను పంచేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. తాజాగా చేపట్టిన ఇంటింటి సర్వేలో వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన దోపిడీ, నిధుల దుర్వినియోగం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మున్సిపల్ శాఖలో వసూలు చేసిన పన్నుల సొమ్ము ప్రభుత్వ ఖజానాకి జమ చేయకుండా జేబుల్లోకి వేసుకున్న ఉదంతం తాజాగా బయటపడింది. వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు నిధుల స్వాహాలో భాగస్వాములైనట్లు తెలుస్తోంది. మెక్కిన సొమ్మును ఏ విధంగా

(మిగతా 6లో...)

నేడు పింఛన్ల సొమ్ము పంపిణీ

- రూ.124.99 కోట్లు విడుదల

అనంతపురం అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పెన్షన్ భరోసా సొమ్మును ఆగస్టు నెలకు సంబంధించి శుక్రవారం ఉదయం నుంచి లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలోని 280811 మంది పింఛన్‌దారులకు రూ.124.99 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. తొలి రోజే లబ్ధిదారులందరికి పింఛన్ల సొమ్మును అందజేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. తొలి రోజు ఎవరైనా పింఛన్ సొమ్ము తీసుకోకపోతే మరుసటి రోజు సచివాలయం వద్దకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు తీసుకోవాలని సూచించారు.

కొందరికి తాత్కాలిక నిలుపుదల

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ పునఃపరిశీలన ప్రక్రియ చేపట్టింది. జిల్లాలోని అనంతపురం సర్వజన ఆస్పత్రితోపాటు మరో ఆరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో దివ్యాంగ పింఛన్‌దారులకు దివ్యాంగత్వంపై పునఃపరిశీలన చేస్తున్నారు. దివ్యాంగులు పింఛన్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని అధికారులు నోటీసులు జారీ చేసినా కొందరు హాజరు కాలేదు. అలాంటి దివ్యాంగుల పింఛన్లను ఆగస్టు నెల నుంచి తాత్కాలికంగా నిలిపేయాలని ప్రభుత్వం నుంచి డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే ఎంత మంది దివ్యాంగుల పింఛన్లను తాత్కాలికంగా నిలుపుదల చేశారన్న సమాచారం డీఆర్‌డీఏ పింఛన్ విభాగం అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 1588 మంది దివ్యాంగుల పింఛన్లను ఆగస్టు నెలలో తాత్కాలికంగా నిలిపేశారంటూ వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. డీఆర్‌డీఏ పింఛన్ విభాగం అధికారులు మాత్రం తమకు ఇంకా జాబితా రాలేదని చెబుతున్నారు.

అన్నదాతా సుఖీభవకు ఏర్పాట్లు చేయండి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



వీసీలో ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆగస్టు 2న అన్నదాతా సుఖీభవ పథకం ప్రారంభోత్సవం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్నదాతా సుఖీభవ, ఇతర అంశాలపై కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు హాజరయ్యారు. వీసీ అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అన్నదాతా సుఖీభవ పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. జిల్లాలో 2,80,418 మంది రైతులు ఈ పథకానికి అర్హులని, ఇప్పటివరకు 2,74,210 మంది రైతులు ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని అన్నారు. 5579 మంది ఈ-కేవైసీ రిజెక్ట్ అయిందని, 629 మంది ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఈ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20వేల ఆర్థిక సాయం ప్రకటించిందని అన్నారు. ఇందులో కేంద్రం రూ.6 వేలు, రాష్ట్రం రూ.14 వేలు ఇస్తుందని అన్నారు. ఈ సొమ్ము మూడు విడతలుగా అందుతుందని, మొదటి విడతలో రాష్ట్రం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2 వేలు చొప్పున ఆగస్టు 2న విడుదల అవుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో అర్హులైన రైతుల జాబితా ప్రదర్శించాలని, ప్రతి రైతుకు లింక్ షేర్ చేయాలని సూచించారు. 'అన్నదాతా సుఖీభవ పోర్టల్, మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్'లో 'మీ స్థితిని తెలుసుకోండి' ఎంపిక ద్వారా రైతులు అర్హత, అనర్హత కారణాలను తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు.

గూడ్స్ రైళ్ల లూప్‌లైన్లను పెంచుతాం

- డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా



అధికారులతో చర్చిస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సిమెంటు ఫ్యాక్టరీల వద్ద రైల్వే సైడింగ్ స్టేషన్లలో గూడ్సు రైళ్ల లూప్‌లైన్లను పెంచుతామని, లెవెల్ క్రాసింగ్‌లను తగ్గించి సరుకు రవాణాను వేగవంతమయ్యేలా చేస్తామని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో అల్ట్రాటెక్, పెన్నా సిమెంట్స్ సైడింగ్స్ (స్టేషన్ల) అధికారులతో వ్యాపారాభివృద్ధి సమావేశాన్ని గురువారం ఉదయం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం మాట్లాడుతూ సిమెంట్ సైడింగ్ స్టేషన్లలో మౌలిక వసతులను మెరుగుపరుస్తామన్నారు. రైల్వే రేక్‌లకు అదనపు సౌకర్యాలు, సిబ్బందికి విశ్రాంతి గదుల ఏర్పాటు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఇదేం మత్తు..!

- గంజాయి కాదని ఎస్పీ ప్రకటన
- మద్యం మత్తులోనే గొడవ అని స్పష్టం
- కాదు.. గంజాయే అంటున్న తల్లిదండ్రులు
- సమస్యను వదిలేసి.. హక్కులపై అవగాహన
- కాళసముద్రంలో ఎస్పీ రత్నకు చేదు అనుభవం
- న్యాయం కోసం చుట్టుముట్టిన చిన్నారుల తల్లులు
- విష రసాయనం తాగేందుకు యత్నం





ఎస్పీని నిలదీస్తున్న మహిళ

కదిరి అర్బన్, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రంలో గంజాయి వ్యవహారంపై పోలీసులు దాగుడుమూతలు ఆడుతున్నారా..? తమ బిడ్డలు మత్తుకు బానిసలయ్యారు.. కాపాడండి అని గ్రామస్థులు నెత్తీనోరు కొట్టుకుంటుంటే.. పోలీసులు మాత్రం అది గంజాయి కాదు, మద్యం అని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. పైగా 'గంజాయి' అని రాస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీడియాను హెచ్చరిస్తున్నారు. అది గంజాయి కాకుండా, మద్యమే అయితే కొంత నయమే. కానీ 'గంజాయి' అని చెబుతున్నది తల్లిదండ్రులు కదా..? ఇలాంటి వ్యవహారాల్లో తమ బిడ్డల పాత్ర ఉంటే సాధారణంగా తల్లిదండ్రులు గోప్యంగా ఉంచుతారు. కానీ నిస్సహాయ స్థితిలో మీడియా ఎదుట బహిరంగంగా చెబుతున్నారు. తమ బిడ్డలను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయిని కట్టడి చేసి, తమ బిడ్డలను పోలీసులే రక్షించాలని వేడుకుంటున్నారు. ఏమీ తెలియకుండానే తల్లిదండ్రులు తమ బిడ్డలే గంజాయికి అలవాటు పడ్డారని చెబుతారా..?

గంజాయికి బానిసయ్యాడు

నా కుమారుడు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసయ్యడు. పలుమార్లు దండించినా మార్పురాలేదు. మత్తుకు అలవాటుపడిన మైనర్లు వారి స్నేహితులకు కూడా అలవాటు చేస్తున్నారు. వారి బంగారు భవిష్యత్తు నాశనమౌతుంటే తల్లిదండ్రులుగా ఏం చేయాలో తోచడంలేదు. పోలీసులు గంజాయి సరఫరాపై నిఘా పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలి.

-కాళసముద్రం గ్రామానికి చెందిన ఓ తండ్రి ఆవేదన

మత్తు కాదు.. మందు

కదిరి మండలంలో గంజాయి మత్తులో యువకులు గొడవపడినట్లు మీడియాలో ప్రచారం చేశారు. ఇది వాస్తవం కాదు. మద్యం మత్తులో గొడవ పడినట్లు మా విచారణలో తేలింది. మీడియా, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- ఎస్పీ రత్న

ఇదేం చోద్యం..?

ఆ ఊరికి గంజాయి నిజంగానే వస్తోందా..? బడికో.. కాలేజీకో వెళ్లే మైనర్లకు మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి..? పోనీ.. ఎస్పీ చెప్పినట్లుగానే అది మద్యమే అయినా.. మైనర్లకు విక్రయించేవారిపై చర్యల దిశగా ఎందుకు ప్రయత్నాలు చేయడం లేదు..? మైనర్లు దాడిచేస్తున్న దృశ్యాలను చూస్తే ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. 'రేయ్.. జైలుకు వెళ్లేందుకైనా సిద్ధం..' అనే స్థాయికి పసివారు దిగజారిపోయారు. 'రేయ్ వదిలిపెట్టండ్రా.. ప్లీజ్' అని బాధిత బాలురు వేడుకుంటున్నా కనికరించలేదు. దీనికి పగ, ప్రతీకారాలు కారణం కాదు..! మత్తు మాత్రమే కారణమని దాడి చేస్తూ దూషించేవారి మాటలను వింటే స్పష్టంగా అర్థమౌతోంది. ఇలాంటి సమయంలో అసలు విషయాన్ని పక్కకు నెట్టి.. 'చట్టపరమైన చర్యలు' అని మీడియాను బెదిరించడం విస్మయం కలిగిస్తోంది. చిన్నారుల విషయంలో అసత్య ప్రచారం చేయాల్సిన అవసరం మీడియాకు ఏముంటుంది..?

కుమిలిపోతున్న తల్లిదండ్రులు

గంజాయి మత్తుకు బానిసలుగా మారిన తమ పిల్లలు చేస్తున్న వికృత (మిగతా 6లో)

పైసా వసూల్..!



అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన హిజ్రాలు, మహిళలు

ఇంటి స్థలాల పేరుతో హిజ్రాలు, కూలీలకు కుచ్చుటోపీ

దళిత సంఘాల నేతపై హిజ్రాల దాడి

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా

అనంతపురం క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలోని లెక్చరర్స్ కాలనీ సమీపంలో ఉన్న వంక పోరంబోకు భూముల్లో ఇంటి స్థలాలు ఇప్పిస్తామని కొందరు దళిత సంఘాల నాయకులు హిజ్రాలు, కూలీల నుంచి భారీగా వసూలు చేశారు. పట్టాలు, అభివృద్ధి కార్యక్రమాల పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు మొదలు రూ.50 వేల దాకా తీసుకున్నారు. కానీ పట్టాలు ఇప్పించకుండా మోసగించారని బాధితులు ఆందోళనకు దిగారు. అనంతపురం నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం హిజ్రాలు, మహిళలు బైఠాయించారు. అంతకు ముందు డబ్బులు వసూలు చేసిన దళిత సంఘం నాయకుడు హనుమంతుపై హిజ్రాలు, ఇతర బాధిత మహిళలు చుట్టుముట్టి దాడి చేశారు. పోరంబోకు భూముల వద్ద హనుమంతును కదలనివ్వకుండా నిర్బంధించారు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అక్కడికి వెళ్లడంతో బాధితులు వారిని చుట్టుముట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఓ స్థాయిలో హిజ్రాలు పోలీసులను సైతం కదలనివ్వలేదు. అతి కష్టమ్మీద హనుమంతును పోలీసులు స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. దీంతో హిజ్రాలు, బాధిత మహిళలు స్టేషన్ వద్దకు వచ్చి బైఠాయించారు. స్టేషన్ వద్ద కూడా హనుమంతును హిజ్రాలు చుట్టుముట్టి దూషించారు. దళిత సంఘాల పేరుతో చంద్ర, మణికంఠ, హనుమంతు, సూరి మరో ఇద్దరు నాయకులు తమను మోసగించారని బాధితులు వాపోయారు. వంక పోరంబోకు భూముల్లో ఇంటి స్థలాలు ఇప్పిస్తామని నమ్మబలికారని, రూ.10 వేలు రూ.30 వేలు, రూ.50 వేలు.. ఇలా ఎంతపడితే అంత వసూలు చేశారని అన్నారు. సుమారు 175 మంది నుంచి రూ.కోటికి పైగా వసూలు చేశారని, ఇప్పటి వరకూ తమకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పోలీసులే న్యాయం చేయాలని వేడుకున్నారు. స్టేషన్ వద్ద హిజ్రాలు సీఐ శాంతిలాల్ కాళ్లపై పడ్డారు. న్యాయం చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు. నాయకుల్లో ఇద్దరు దొరికారని, వారిని విచారిస్తున్నామని సీఐ తెలిపారు. స్థలాల పేరిట మోసగించినందుకు కేసు నమోదు చేస్తామని తెలిపారు

మీ పింఛన్‌కు మాదీ పూచీ..!

(5వ పేజీ తరువాయి)

దళారులు వసూళ్లకు తెగబడుతున్నారు. యాడికి మండలవ్యాప్తంగా ఇప్పటివరకు 231మందికి వైకల్య పునఃపరిశీలనకు వెళ్లవలసిందిగా ఎంపీడీఓ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేశారు. తాడిపత్రి, అనంతపురం ప్రభుత్వ వైద్యశాలలకు పంపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొన్న కొందరు దళారులు.. డాక్టర్లతో తాము మాట్లాడతామనీ, వైకల్య సర్టిఫికెట్ వచ్చేలా చేస్తామంటూ వైకల్యం పునఃపరిశీలనకు వెళ్లే వారిని బురిడీ కొట్టిస్తూ డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారు. మండలంలోని చిక్కేపల్లికి చెందిన దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు వైకల్య పునఃపరిశీలనకు తాడిపత్రికి వెళ్లారు. వారితో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తితోపాటు యాడికికి చెందిన ఆర్ఎంపీ దళారుల అవతారం ఎత్తి అక్రమ వసూళ్లు చేసినట్లు పలువురు వైకల్య పునఃపరిశీలనకు వెళ్లినవారు తెలిపారు. వైకల్య పునఃపరిశీలనకు వెళ్లిన వారితో రూ.20వేల నుంచి 30వేలు డిమాండ్ చేసి వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. అడిగినంత ఇవ్వకపోతే వైకల్య ధృవీకరణ సర్టిఫికెట్‌లో వైకల్యశాతం పూర్తిగా తగ్గించి ఇస్తారనీ, దాంతో మీ పింఛన్లు తొలగిస్తారని వైకల్య పునఃపరిశీలనకు వెళ్లే వారిని భయభ్రాంతులకు లోనుచేసి వారితో డబ్బులు ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఇలాంటి దళారులపై అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ సర్పంచ్‌ల వసూళ్లు

పుట్లూరు మండలంలో కొందరు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఇప్పటికే మండలంలో పలు పింఛన్లను అమ్మ్యామ్యాలు పుచ్చుకుని, నిలబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలవ్యాప్తంగా 108 మంది పింఛన్ లబ్ధిదారులకు అధికారులు నోటీసులు అందించారు. వైద్యాధికారుల వద్దకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో పింఛన్లను నిలబెడతామంటూ వసూళ్లకు తెగబడుతున్నారు. చాలా గ్రామాల్లో వైసీపీ మద్దతు సర్పంచులే కొందరు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

డబ్బులు ఇచ్చి మోసపోకండి



పింఛన్‌దారులు దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. అర్హుల పింఛన్లను తొలగించరు. సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామనీ, పింఛన్లను నిలబెడతామంటూ దళారులు చెప్పే మాటలు పూర్తిగా అవాస్తవం. ఎవరైనా అలా వసూలు చేస్తుంటే మా దృష్టికి తీసుకురావాలి.

- అలివేలమ్మ, ఎంపీడీఓ, పుట్లూరు

వైసీపీ దోపిడీ రూ. 11 కోట్లు

(5వ పేజీ తరువాయి)

వసూలు చేస్తారో చూడాలి.

అడ్డగోలుగా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో మున్సిపాలిటీల్లో అడ్డగోలుగా నిధులు దోచేశారు. ఇంటి పన్నులు వసూళ్లలో మాయాజాలం ప్రదర్శించారు. వైసీపీ నేతలతో సిబ్బంది కుమ్మక్కై యథేచ్ఛగా నిధులు మెక్కేశారు. వసూలు చేసిన పన్ను వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా మాన్యువల్ స్లిప్పులు ఇచ్చి కాజేసినట్లు తేలింది. తాజాగా ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు నిగ్గుతేల్చారు. ఆ సొమ్ము అప్పటి అధికారుల నుంచి రికవరీ చేయాలా, వైసీపీ నేతల నుంచి రాబట్టాలా అన్న అంశంపై స్పష్టత లేదు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేయడంపై ఇంటింటా సర్వే చేశారు. 12 మున్సిపాలిటీల్లో 500 మంది రెవెన్యూ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు. నివేదికలను ఆయా ఉమ్మడి జిల్లాల నగరపాలక సంస్థ కమిషనర్లకు అందజేశారు. వారి నుంచి మున్సిపల్ ఆర్డీ కార్యాలయానికి నివేదికలు చేరవేస్తున్నారు. వాటి ఆధారంగా ఎన్ని ఇళ్ల నుంచి ఎంత మేర వసూలు చేసి, జేబుల్లోకి వేసుకున్నారనే అంశంపై మరోసారి మున్సిపల్ శాఖ అధికారులు విచారణ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

వ్యత్యాసం ఉన్న వాటిపైనే సర్వే

- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్



గతంలో ఇంటి పన్ను వసూళ్లలో వ్యత్యాసం ఉన్నట్లు పురపాలక శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. అనంతపురం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పరిధిలోని 42 మున్సిపాలిటీల్లో ఇంటింటి సర్వే చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అదనపు కుదింపుతో రెవెన్యూ లోటు వచ్చింది. ఈ విషయంలో స్పష్టత కోసమే సర్వే చేయించారు. ఐదు రోజులపాటు ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో 500 మంది సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం.

అప్పుల్లో అన్నదాత..

బడాబాబుల సేవలో మోదీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



ధర్మవరం బహిరంగ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురంరూరల్/ధర్మవరం, జూలై31(ఆంధ్రజ్యోతి): దేశంలో అన్నదాతలు అప్పుల ఊబిలో చిక్కి విలవిల్లాడుతుంటే.. ప్రధాని మోదీ మాత్రం బడాబాబుల సేవలో తరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరులో రాప్తాడు నియోజకవర్గ, ధర్మవరంలో జిల్లా మహాసభలు నిర్వహించారు. తొలుత భారీ ర్యాలీలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభల్లో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులకు ఒరిగింది శూన్యమన్నారు. కాంగ్రెస్ పోతేనే రైతులకు న్యాయం జరుగుతుందంటూ ప్రగల్భాలు పలికి గద్దెనెక్కిన బీజేపీ దశాబ్ద కాలంలో చేసింది ఏమీలేదని దుయ్యబట్టారు. నాలుగు నెలలకోసారి రూ.రెండు వేలు ఇచ్చి చేతులు దులుపుకొంటోందన్నారు. రైతులను భిక్షగాళ్లలా చూస్తున్నారన్నారు. అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పెట్టుబడులు కూడా దక్కక అప్పుల పాలవుతున్నారన్నారు. అలాంటి అన్నదాతను ఆదుకోవాల్సిన కేంద్రం ఆ ఊసే మరచిందన్నారు. కోటీశ్వరులకు కొమ్ము కాస్తోందన్నారు. వారి ఆస్తులను మరింత పెంచేందుకే పనిచేస్తున్నారన్నారు. ప్రపంచంలోనే ధనవంతులుగా మారేందుకు అన్నివిధాలా సహకరిస్తోందన్నారు. సామాన్యుల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు ఉండటం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు కోసం అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం కూడా రైతులకు చేసిందేమీ లేదన్నారు. ఏడాది తరువాత కేంద్రంసొమ్ముతో కలిపి రూ.7వేలు ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. రైతులేమైనా భిక్షగాళ్లా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర రాష్ట్రకార్యవర్గసభ్యులు రామచంద్రయ్య, జాన్సన్‌బాబు, జగదీశ్, అనంత, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు, జాఫర్, వేమయ్యయాదవ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, సీపీఐ రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల కార్యదర్శులు రామకృష్ణ పాల్గొన్నారు.

5 నుంచి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5 నుంచి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్ భాస్కర్ తెలిపారు. అండర్-22 విభాగంలో బాల, బాలికలకు ఆర్చరీ, అథ్లెటిక్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిపోటీలు నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో జరుగుతా యన్నా రు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు జోనల్ స్థాయి తిరుపతి లో, జోనల్ స్థాయిలో గెలుపొందిన విజేతలకు రాష్ట్రస్థాయి విశాఖ పట్నంలో పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849421462ను సంప్రదించాలని కోరారు.



ప్యాసింజర్ రైలు రావడంతో స్టేషన్‌లో రద్దీ

సమయానికి వస్తే బాగుంటుంది



విధి నిర్వహణలో భాగంగా రోజూ అనంతపురం నుంచి ధర్మవరానికి రాకపోకలు సాగిస్తున్నా. ప్యాసింజరు రైలు సమయానికి వస్తే చాలా ప్రయోజనకరం. ఆలస్యమైతే విధులకు వెళ్లడం ఇబ్బంది అవుతోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

- శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగి

ఎప్పుడొస్తుందో.. ఎప్పటికి చేరుస్తుందో తెలియని దుస్థితి

అడుగడుగునా క్రాసింగ్‌లే..

సమయానికి గమ్యానికి చేరుకోలేకపోతున్న విద్యార్థులు, ఉద్యోగులు

పట్టించుకోని రైల్వే యంత్రాగం

ఎడ్లబండే నయం..!

సమయపాలన పాటించని తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు

కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరులో ప్రయాణం అంటే జంకాల్సిన పరిస్థితి. విద్యాసంస్థలకు విద్యార్థులు, కార్యాలయాలకు ఉద్యోగులు చేరుకునేందుకు వీలుగా రైలు షెడ్యూల్ ఉంది. సమయానికి వచ్చింది ఏనాడూ లేదు. ఎప్పుడొస్తుందో తెలీదు.. ఎప్పటికి గమ్యానికి చేరుస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి. రైలును నమ్మి ఆఫీసులకు బయల్దేరిన ఉద్యోగులు మధ్యాహ్నానికి చేరుతున్నారు. స్కూళ్లకు, కాలేజీలకు ఆలస్యంగా చేరుకుంటూ చీవాట్లు తినాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. నడిచేదే చాలా నిదానం. ఇది చాలదన్నట్లు అడుగడుగునా క్రాసింగ్‌లే. విద్యార్థులు, ఉద్యోగులు, తిరుపతి వెళ్లే వారికి ఎంతో ఉపయోగకరమని ఈ ప్యాసింజరు రైలును సమయానికి నడపడంలో రైల్వే తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు.

అనంతపురం న్యూటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కదిరిదేవరపల్లి నుంచి గుంతకల్లు, ధర్మవరం, కదిరి మీదుగా తిరుపతికి వెళ్లే ప్యాసింజర్‌ను పేదల బండిగా చెప్పుకుంటారు. షెడ్యూల్ విద్యార్థులు, ఉద్యోగులకు అనుకూలంగా ఉంది. నిత్యం గంటల కొద్దీ ఆలస్యమవుతోంది. సమయానికి వచ్చిన, గమ్యానికి చేర్చిన చరిత్ర లేదని ప్రయాణికులు వాపోతున్నారు. తిరుపతికి ప్యాసింజరు (57404) గుంతకల్లులో ఉదయం 8 గంటలకు బయలు దేరుతుంది. కల్లూరుకు ఉదయం 8.50 గంటలకు వస్తుంది. అక్కడి నుంచి అనంతపురం స్టేషన్‌కు 9.15 గంటలకు చేరుతుంది. గంట, రెండు గంటల వరకు ఆలస్యమవుతోంది. గుంతకల్లు నుంచి ఆ మార్గంలో గూళ్లపాల్యం, వెంకటాంపల్లి, ఖాదర్‌పేట, కల్లూరు, గార్లదిన్నె స్టేషన్ల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు.. జిల్లా కేంద్రం చేరుకోవడానికి చాలా ప్రయోజకరంగా ఉంటుంది. విద్యాలయాలన్నీ 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. సమయానికి అనుగుణంగా చేరుకునే వెసులుబాటు ఉంది. ఇక జిల్లా కేంద్రం, ధర్మవరం మధ్యలో ఉండే స్టేషన్లలోని సమీప ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ ప్యాసింజరు చాలా ప్రయోజకరంగా ఉంటుంది. షెడ్యూల్ మేరకు ఉదయం 10.05 గంటలకు ధర్మవరం చేరాలి. ఆ మార్గంలో వెళ్లే ఉద్యోగులు ఈ ప్యాసింజరు మీద ఆధారపడుతుంటారు. ఏరోజూ సమయం మేరకు రాకపోకలు సాగించిన పాపానపోలేదు. ఒకట్రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం చాలామందికి ఉపయోగపడే ప్యాసింజరును ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారు. ధర్మవరం వరకు డబుల్ లైన్ ఉంది. సమయానికే నడిపే అవకాశం ఉంది. ఆ దిశగా రైల్వే అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తిరుపతి ప్యాసింజర్ రైలు

తక్కువ ఖర్చు: ఆనంద్, ప్రయాణికుడు



వ్యాపార నిమిత్తం అనంతపురం నుంచి నిత్య ధర్మవరం, కదిరి ప్రాంతాలకు వెళ్తుంటా. ప్యాసింజరు రైలులో తక్కువ ఖర్చుతో వెళ్లవచ్చు. రైలు సమయానికి రాకపోవడంతో స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. సమయానికి వెళ్లకపోతే పనులు ఆలస్యమవడంతోపాటు ఒక్కోసారి జరగవు కూడా. రైలు సమయానికి వస్తే చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

తిరుపతికి వెళ్లేందుకు చాలా అనుకూలం



అనంతపురం నుంచి తిరుపతికి వెళ్లాలంటే ప్యాసింజరు రైలు చాలా అనుకూలం. కుటుంబ సభ్యులతో కలిసి తక్కువ ఖర్చుతో ప్రయాణించవచ్చు. ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తుండడం ఇబ్బందికరంగా మారుతోంది. సమయపాలన పాటిస్తే బాగుంటుంది.

- నాగరాజు, ప్రయాణికుడు

రూ.6 తగ్గిన టమోటా ధర

అనంతపురంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధర ఒక్కరోజులోనే భారీగా పడిపోయింది. కిలోపై ఏకంగా రూ.6 తగ్గిపోయింది. బుధవారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయాయి. గురువారం కిలో రూ.34కి పడిపోయింది. కనిష్ఠ ధర రూ.20, సరసరా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మొత్తంగా మార్కెట్‌కు 3,150 టన్నుల టమోటా కాయలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక

అనంతపురం విద్య, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్ డైరెక్టర్స్ (పీడీలు) సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన పీడీ నరసింహారెడ్డి నియమితులయ్యారు. కృష్ణా జిల్లా కోడూరులో పీడీల అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈసందర్భంగా జరిగిన రాష్ట్రకమిటీ ఎన్నికలలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లాకు చెందిన పీడీ నరసింహారెడ్డి తెలిపారు. ఆయన ప్రస్తుతం శింగనమల నియోజకవర్గం పెరవలి జడ్పీ హైస్కూల్ పీడీగా పనిచేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహారెడ్డిని తోటి పీడీలు అభినందించారు.

అక్కడ నిర్మాణాలకు అనుమతించం

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్లలో భవన నిర్మాణాలకు భవిష్యత్తులో అనుమతులు ఇచ్చేది లేదని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ స్పష్టం చేశారు. అహుడా కార్యాలయంలో అనధికారిక లే అవుట్లపై చైర్మన్ టీసీ వరుణ్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి 2020కు సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబరు 134 జారీ చేసిందని తెలిపారు. లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) 2025 జూన్ 30వతేదీ వరకు పొడిగించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. అహుడా పరిధిలో అనధికార లే అవుట్లలో కచ్చితంగా ఎల్ఆర్ఎస్ చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం అని తేల్చి చెప్పారు. 2025 జూన్ 30నాటికి ప్లాట్ల రిజిస్ట్రేషన్ అయి ఉండాలని, కనీసం ఒక ప్లాట్ అయినా అమ్మి ఉండాలన్నారు. లే అవుట్ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వెంచర్‌లు వేసి ప్రజలను మభ్యపెడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, డీఈలు రేవంత్, సరస్వతి పాల్గొన్నారు.

అక్రమ మద్యం వరద



సుంకం చెల్లించకుండా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాకు చేరిన మద్యాన్ని పారబోస్తున్న అధికారులు (ఫైల్)

గత ఎనిమిది నెలల్లో మద్యం పట్టివేత వివరాలు ఇలా..

మద్యం రకం	కేసులు	అరెస్టులు	సీజ్ చేసిన మద్యం (లీటర్లలో)	సీజ్ చేసిన వాహనాలు
ఎన్‌డీపీఎల్	1,516	1,568	13,534	185
నాటుసారా	615	448	2580	18
బెల్ట్‌షాప్స్ మద్యం	990	996	2,333	77
మొత్తం	3,121	3,012	18,447	280

(5వ పేజీ తరువాయి)

అధికారులు సీజ్ చేశారు.

నాటుసారా రహిత అనంతకు కృషి



గత 8 నెలల్లో జిల్లాలో పెద్దఎత్తున దాడులు చేశాం. అక్రమ మద్యాన్ని కట్టడి చేయడంతోపాటు, కేసులు నమోదుచేశాం. అక్టోబరు 15 తర్వాత ఎన్‌డీపీఎల్ 13,534, నాటుసారా 2580, బెల్టు మద్యం 2,333 లీటర్లు సీజ్ చేశాం. నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయడంతోపాటు, బెల్లం ఊట 82,235 లీటర్లు ధ్వంసం చేశాం. ఆగస్టు చివరికి నాటుసారా రహిత జిల్లాగా అనంతపురాన్ని మార్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం.

-నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ, ఉమ్మడి జిల్లా

అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి



అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టిపెట్టాం. పాత నిందితుల వివరాలు సేకరించి, వారిని గుర్తించే పనిలో ఉన్నాం. మద్యం అక్రమంగా తయారు చేస్తున్నా, రవాణా చేస్తున్నా ప్రజలు నిర్భయంగా 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చు. కఠిన చర్యలు తీసుకుంటాం.

- శ్రీరామ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్), ఉమ్మడి జిల్లా

ఖతర్‌లో తనకల్లువాసి మృతి



నూరుల్లా (ఫైల్)

తనకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నూరుల్లా(36) ఖతర్‌లో గురువారం ఉదయం మృతిచెందాడని బంధువులు తెలిపారు. మూడేళ్ల క్రితం ఖతర్ వెళ్లిన నూరుల్లా.. ఆ దేశంలోని వకారాలో ఓ వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేసేవారు. అప్పటి నుంచి స్వదేశానికి తిరిగి రాలేదు. గత వారం రోజులుగా మనోవేదన చెందేవాడని అతనితో కలిసి పనిచేసిన మరో డ్రైవర్ తమకు తెలిపారని బంధువులు తెలిపారు. యజమానిని జిమ్ సెంటర్‌లో వదిలి, తిరిగివచ్చే సమయంలో మార్గమధ్యంలో ఓ ఫ్లై ఓవర్ వద్ద వాహనాన్ని ఆపాడని, ఫ్లై ఓవర్‌పై నుంచి కిందపడి మృతిచెందాడని సమాచారం వచ్చిందని తెలిపారు. ఆత్మహత్యనా? ప్రమాదమా..? అన్నది తెలియాల్సి ఉంది. నూరుల్లాకు భార్య, ఇద్దరు కూతుళ్లు, తల్లి ఉన్నారు. నూరుల్లా మృతి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, ఉదయం మృతిచెందాడని సమాచారం అందగా, సాయంత్రానికి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం వచ్చింది. కానీ కుటుంబ సభ్యులకు ఆ సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సాయం కోరామని బంధువులు తెలిపారు.

ఎరువుల కొరత రాకూడదు

అనంతపురం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామ హేశ్వరమ్మ ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె టెక్నికల్ ఏఓ వంశీకృష్ణతో కలిసి పలు కంపెనీల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. డీలర్లు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదేం మత్తు..!

(5వ పేజీ తరువాయి)



కాళసముద్రంలో పోలీసులను చుట్టుముట్టిన గ్రామస్థులు

చేష్టలు, వారి ఆగడాలను భరించలేక, ఎవరితోనూ చెప్పుకోలేక తల్లిదండ్రులు ఇన్నాళ్లూ కుమిలిపోయారు. దాడి ఘటన తరువాత నోరు విప్పుతున్నారు. సుమారు ఏడాది నుంచి నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచిగా చెప్పినా, ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదని కుమిలిపోతున్నారు. పిల్లలను మందలిస్తే ఆ మత్తులో వారు ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడతారోనన్న భయం వారిని వెంటాడుతోంది. పిల్లల భవిష్యత్తును తలచుకుని నిద్రాహారాలు మానుకుని కుంగిపోతున్నారు. గంజాయి సరఫరాపై గట్టి నిఘా పెట్టి, విక్రయదారులు, వినియోగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్కడి నుంచి వస్తోంది..?

విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో దొరికే గంజాయిని వివిధ మార్గాల్లో ఇక్కడకి తెస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రైళ్లలో భిక్షగాళ్ల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది యువత రైళ్లలో గంజాయిని బ్యాగుల్లో పెట్టి, వారు మరోచోట కూర్చొని దాన్ని గమనిస్తూ ఉంటారు. రైలు స్టేషన్‌కు చేరడానికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోనే ఫోన్ల ద్వారా సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇస్తారు. వారు రాగానే బ్యాగులు బయటకు విసిరి వేస్తున్నట్లు సమాచారం. అలా కిలోల్లో తెచ్చిన గంజాయిని చిన్నసైజ్ ప్యాకెట్లుగా తయారు చేసి, రూ.50 నుంచి వందకు విక్రయిస్తున్నట్లు సమాచారం. కొందరు సిగరెట్లలోని పొగాకును తీసి, దాని స్థానంలో గంజాయి పొడిని పెట్టి పొగ పీలుస్తున్నారు.

న్యాయం చేయండి..!

తమ పిల్లలపై విచక్షణారహితంగా దాడిచేసినవారిని కఠినంగా శిక్షించాలని ఎస్పీ రత్నను బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. ఎస్పీ ఎదుటే ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేశారు. కాళసముద్రంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాలలపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో గ్రామంలో ఎస్పీ మానవహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ప్రసంగించిన అనంతరం బాధిత తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఐదురోజుల క్రితం తమ పిల్లలను ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు విచక్షణారహితంగా కొట్టారని, చెప్పులు, చింతబర్రలతో దాడి చేశారని వాపోయారు. ఈ సంఘటన వెలుగులోకి వచ్చి మూడు రోజులైనా నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. గ్రామంలోని పలువురు మహిళలు ఎస్పీని చుట్టుముట్టారు. తాము అవమానంతో కుమిలిపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు మహిళలు విషరసాయనాన్ని తాగేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని బాటిల్ లాగేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అయినా మహిళలు శాంతించలేదు. ఎస్పీని చుట్టుముట్టడంతో డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నిరంజన్ రెడ్డి వారికి సర్దిచెప్పేందుకు తంటాలు పడ్డారు. దీంతో గ్రామంలో తీవ్ర గందరగోళం, ఉద్రిక్తత ఏర్పడ్డాయి. డీఎస్పీ దగ్గరుండి ఎస్పీని వాహనంలో ఎక్కించి గ్రామం నుంచి పంపించేశారు. బాధిత మహిళలను శుక్రవారం స్టేషన్‌వద్దకు రావాలని పోలీసులు సూచించారు.

పురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- రైల్వే జీఎం ముకుల్ శరణ్ మథూర్

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతామని రైల్వేశాఖ బెంగళూరు జనరల్ మేనేజర్ ముకుల్ శరణ్ మథూర్ అన్నారు. ఆయన హిందూపురం రైల్వే స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో ప్రయాణికుల మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ప్రతి విభాగాన్ని తనిఖీ చేశారు. అమృత్‌భారత్ కింద హిందూపురం రైల్వేస్టేషన్ ఎంపికైందని ఇప్పటికే దానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఏడాది లోపు పనులు పూర్తి చేసి స్టేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రయాణికులకు అవసరమైన లిఫ్ట్, ర్యాంప్, ఎక్సలేటర్‌ను ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నామన్నారు. పుట్టపర్తి ప్యాసింజర్ రైలును యథావిధిగా కొనసాగించాలని పలువురు ప్రయాణికులు కోరారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని జీఎం హామీ ఇచ్చారు. ఈయనవెంట డీఆర్ఎం అశితోష్ కుమార్ సింగ్, ఏడీఆర్ఎం పి.మోహన్, స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్ రామచంద్ర, కిరణ్, సోమప్ప తదితరులు ఉన్నారు.



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే జీఎం మథూర్

బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి బెంగళూరు-బీదర్ (వయా గుంతకల్లు) అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (06519) ప్రత్యేక రైలు ఈ నెల 14న రాత్రి 9-15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11-30 గంటలకు బీదర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06520) బీదర్‌లో 15న మధ్యాహ్నం రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం నాలుగున్నరకు బెంగళూరుకు చేరుతుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, వాడి, షంషాబాద్, కలబురగి, హుమ్నాబాద్ మీదుగా బీదర్‌కు చేరుకుంటుందన్నారు.

క్రైం కార్నర్

ఆటో కింద పడి విద్యార్థిని మృతి



తనూజ (ఫైల్)

గార్లదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం.. ఓ విద్యార్థినిని బలిగొంది. మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం సాయంత్రం ఆటో కింద పడి తనూజ(9) మరణించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దవడుగూరు మండలం ఈరన్నపల్లికి చెందిన వెంకటనాయుడు, నాగసునీత దపంతులు మూడేళ్ల క్రితం కల్లూరు కొండకింద ఇందిరమ్మ కాలనీకి వలస వచ్చారు. ఇక్కడే ఉంటూ కూలి పనులకు వెళ్తుండేవారు. వారికి కుమారుడు, కుమార్తె తనుజ సంతానం. తనూజ కల్లూరు ఆర్ఎస్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుండేది. గురువారం పాఠశాలకెళ్లి సాయంత్రం ఆటోలో ఇంటికి బయల్దేరింది. ఇంటి సమీపంలోకి రాగానే విద్యార్థిని ప్రమాదవశాత్తు జారి కిందపడింది. డ్రైవర్ గమనించకపోవడంతో చిన్నారి కాళ్లు, తలపై ఆటో వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని ఆదే ఆటోలో పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుమార్తె మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దకర్మకు వచ్చి ప్రమాదంలో..

చెన్నేకొత్తపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బంధువుల పెద్దకర్మకు వచ్చిన ఓ వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రంపల్లి సమీపంలో గురువారం జరిగింది. హిందూపురం రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపిన మేరకు....బుక్కరాయసముద్రం మండలం పసలూరు కొత్తపల్లికి చెందిన నాగలింగారెడ్డి(57) తన బంధువుల పెద్దకర్మకు ఎర్రంపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో కాలకృత్యాల కోసం వెళ్లి తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హిందూపురం రైల్వే ఎస్ఐ సజ్జప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పెనుకొండకు తరలించారు. మృతుడికి భార్య సుధారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

హిందూపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం దేవరపల్లివద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపారు. గురువారం ఉదయం లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ యర్రిస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారన్నారు. మృతుడి వయసు దాదాపు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గొర్రెల కాపరి..

ముదిగుబ్బ, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు గ్రామంలో బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి సాకే వెంకటేష్(42) మృతిచెందాడు. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాకే వెంకటేష్ గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం రాత్రి గ్రామ శివారులోని పొలంలో గొర్రెలు తోలుకున్నాడు. అక్కడే విద్యుత్ స్తంభం పక్కన కిందపడి ఉన్న విద్యుత్ వైరును పక్కకు తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ అన్న వెంకటరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సిద్ధేశ్వర ఆలయంలో చోరీ

బత్తలపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని డి. చెర్లోపల్లి సమీపంలోని సిద్ధేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆలయంలోని పార్వతీదేవి విగ్రహానికి శ్రావణ మాసం సందర్భంగా రెండు తులాల బంగారం చైను, రెండు తులాల నల్ల పూసల దండ అలంకరించారు. రోజు వారిలాగే పూజారి పవన్‌కుమార్ బుధవారం పూజలు నిర్వహించి గుడికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం గుడికి వెళ్లి చూడగా పార్వతీదేవి విగ్రహానికి ఉన్న బంగారం, వెండి ఆభరణాలు కన్పించలేదు. విషయాన్ని గ్రామస్థులకు వివరించి, వారితో కలసి బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన నమోదు చేస్తున్న పౌరసత్వ చట్ట సవరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిహార్ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమవుతుందని పేర్కొన్నారు. పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. బీజేపీకి రాజకీయ లబ్ధి చేకూర్చేందుకు దీన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. బిహార్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఇలాంటివి అమలు చేయడం తగదన్నారు. ఈ ఎస్ఐఆర్‌ను బిహార్‌కు మాత్రమే కాక దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించడం దారుణమన్నారు. నాలుగేళ్ల కిందట దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణ, జాతీయ పౌరసత్వ రిజిస్టర్ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని దుయ్యబట్టారు. విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ బిహార్‌లో దాదాపు 30 లక్షల మంది వలస కార్మికులను ఓటరు జాబితాను తొలగించాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, లాయర్స్ అసోసియేషన్ నాయకులు సతీష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, ఇర్ఫాన్, వలి, మసూద్, నగర కమిటీ సభ్యులు రాజు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, రామాంజినమ్మ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేయించండి: జేడీఏ

అనంతపురం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'ఏం మీకు చెప్పేది అర్థం కావడం లేదా..? అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులతో ఇంకా ఈకేవైసీ ఎందుకు చేయించలేదు. పెండింగ్‌లోని ఎన్‌పీసీఐ లింక్ చేయించ డంపై నిర్లక్ష్యం ఎందుకు' అని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ పలు మండలాల ఏఓలపై మండిపడ్డారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి టెక్నికల్ ఏఓలు శశికళ, రాకేష్, వంశీకృష్ణలతో కలిసి గురువారం ఆమె మండలాల ఏఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు సంబంధించి పెండింగ్ లోని ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్‌పై పలు మండలాల ఏఓలను ఆమె ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు పెండింగ్‌లో ఉన్న ఈకేవైసీతోపాటు ఎన్‌పీసీఐ లింక్ వెంటనే పూర్తి చేయించేలా చొరవ చూపాలన్నారు. అన్నదాత సుఖీభవ సొమ్ము అర్హులైన రైతులందరికీ జమ అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లోని ఈకేవైసీ పూర్తి చేయడంతోపాటు సంబంధిత బ్యాంక్ అధికారులతో మాట్లాడి, పెండింగ్‌లోని 7802 మంది రైతుల ఎన్‌పీసీఐ లింక్‌ను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు.

సర్వజన ఆశలు..!

పెద్దాస్పత్రిలో నెలకు సగటున 65వేల మందికి సేవలు

- అయినా.. 560 పడకలకే పరిమితం
- సూపర్ స్పెషాలిటీ పరిస్థితీ అంతే..
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేడు విజయవాడకు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం వైద్యం, జూలై31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజన, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు.. సర్వజనులకు వైద్య వసేల నిలయాలుగా మారాయి. నెలకు సగటున 65వేలమందికి ఓపీ సేవలందిస్తోంది. 6500మంది అడ్మిషన్ అవుతుంటే. 5వేలమంది డిశ్చార్జ్ అవుతున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల విభాగంలోనూ అదేస్థాయిలో గణాంకాలు నమోదు అవుతున్నాయి. ఇంత స్థాయిలో సేవలు అందిస్తూనే నేటికీ 560 పడకల ఆస్పత్రిగానే మిగిలిపోయింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కష్టాలు మరోలా ఉన్నాయి. సూది, మందు కావాలన్నా సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాలి. పక్కనే సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఉన్నా.. తీసుకోవడానికి వీల్లేదు. ఎలక్ట్రికల్, ఏసీ, ఐసీయూ, లిఫ్ట్ తదితర సేవల్లో తరచూ అంతరాయం తప్పడంలేదు. ఇక మెడికల్ కాలేజీలో పీజీ, యూజీ విద్యార్థులకు అవసరమైన కంప్యూటరైజ్డ్ సౌకర్యాలు కరువయ్యాయి. లైబ్రరీ, గ్యాలరీ, సెమినార్ హాళ్లు తదితర సౌకర్యాల్లేక పాతపద్ధతిలోనే చదవాల్సి వస్తోందని విద్యార్థివర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నూతన భవన నిర్మాణాలు, సౌకర్యాల కల్పనపై ఎంత చెప్పినా తక్కువేనని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్యవిద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా శుక్రవారం వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) అనంతపురం జిల్లాకు సంబంధించి సమీక్షించనున్నారు. దీంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ ఆత్మారామ్ గురువారం బయలుదేరి వెళ్లారు. ఇక్కడి పరిస్థితులను పరిశీలించి, మెరుగైన వైద్యసేవలు అందించేలా డీఎంఈ నిర్ణయం తీసుకునేరా అంటూ రోగులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



నిర్మాణదశలో సర్జికల్ బ్లాక్ భవనం

560 పడకలకే పరిమితం

జిల్లా ఆసుపత్రి నుంచి బోధనాసుపత్రిగా 2000 సంవత్సరంలో 560 పడకల ప్రభుత్వ సర్వజన వైద్యశాల అప్‌గ్రేడ్ అయింది. ఆ మేరకే డాక్టర్లు ఇతర పారామెడికల్ సిబ్బంది పోస్టులను మంజూరు చేశారు. 560 పడకల ప్రకారమే ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, క్రిటికల్ కేర్ యూనిట్లు, క్యాజువాలిటీ తదితర విభాగాలను ఏర్పాటుచేశారు. 25ఏళ్లలో ఓపీ, ఐపీ, ఓటీ సేవల సంఖ్య పెరిగిపోయింది. ప్రస్తుతం నెలకు సగటును 65వేలమంది ఓపీ సేవలు పొందుతున్నారు. ఈ లెక్కన 1500 పడకలు అవసరం. పోస్టులను మూడింతలు పెంచాలి. సరాసరి 3000 చొప్పున మేజర్, మైనర్ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఆ మేరకు ఆపరేషన్ థియేటర్లు, సదుపాయలు, టెక్నీషియన్లు తదితరాలను అప్‌గ్రేడ్ చేయాలని ఆస్పత్రుల వర్గాలు వివరిస్తున్నాయి. 700 వరకు ప్రసవాలు జరుగుతున్నా.. సౌకర్యాల లేమితో ఇబ్బందులు తప్పట్లేదు.



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐసీయూ వార్డులో పనిచేయని ఏసీ

సిబ్బంది కొరత

సర్వజనాస్పత్రి, వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. 40శాతం మాత్రమే రెగ్యులర్ ఇబ్బంది ఉన్నారు. 30శాతం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేస్తున్నారు. 30శాతం కొరత ఉంది. దీని ప్రభావం వైద్యవిద్య, ఓపీ, ఐపీ, క్యాజువాలిటీ సేవలపై పడుతోంది. సూపర్ స్పెషాలిటీలోని తొమ్మిది విభాగాలకుగాను ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. తొమ్మిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లకుగాను నలుగురు, 18మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకుగాను 9మంది ఉన్నారు. మొత్తం 36 పోస్టులకుగాను 21 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనే ఖాళీగున్నాయి. సర్వజన వైద్యశాల, నాన్ క్లినికల్ విభాగాల్లోనూ అదే సమస్య వెంటాడుతోంది.

నిర్మాణాలకు నిధుల లేమి

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ, ఐపీ సంఖ్య ప్రతి సంవత్సరం రెట్టింపు అవుతోంది. ఈ క్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పెంచేందుకు 2014-19లో అప్పటి పాలనాధికార వర్గం, ప్రభుత్వం శ్రమించాయాయి. ఇక్కడి పరిస్థితులను కళ్లకు కట్టేలా లేఖలో రూపంలో కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. కేంద్ర ప్రభుత్వ స్పందించి ప్రత్యేక సహాయం కింద రూ.300కోట్లను ఇస్తామని హామినిచ్చింది. దీంతో నాలుగు బ్లాక్‌లతో మూడు అంతస్థుల సర్జికల్ బ్లాక్, ఆరు అంతస్తులతో పీజీ హాస్టల్ భవనాలు, తల్లీబిడ్డ ఆస్పత్రి(ఎంసీహెచ్)ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. తెలుగు తల్లి విగ్రహం వద్దనున్న ఇరిగేషన్ కార్యాలయంలో సర్జికల్ బ్లాక్, వైద్య కళాశాలలో పీజీ హాస్టళ్ల పనులు మొదలుపెట్టారు. ఆర్ అండ్‌బీ కార్యాలయంలో తలపెట్టిన ఎంసీహెచ్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. నిధుల లేమి సమస్యగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక నిర్మాణపనులు చేపట్టారు. నిధులు వస్తేనే పనులుపూర్తవుతాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

ఎంపీ నిధులతో..

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తన ఎంపి ల్యాండ్స్ కింద నిధులను ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. రూ.40లక్షలతో మేల్ బ్లాక్, రూ.35లక్షలతో ఫిమేల్ బ్లాక్ పేర్లతో విశ్రాంతి ధామాల నిర్మాణపనులు జరుగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీ)ను నిర్మిస్తున్నారు. కాలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ(సీడీఎస్) నిధులతో రూ.16లక్షల అంచనా వ్యయంతో క్యాంటీన్ మరమ్మత్తులకు శ్రీకారం చుట్టారు.

ప్రతి అంశం క్షుణ్ణంగా...



టీచింగ్, పీజీ, ల్యాబ్స్, పారామెడికల్ ఇలా ప్రతి అంశంపై క్షుణ్ణంగా నివేదికలు రూపొందిస్తున్నాం. కళాశాల, సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మూడింటి అభివృద్ధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. విభాగాల వారీగా వివరాలను, అప్‌గ్రేడ్ అంశాలను నివేదికల రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తున్నాం. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు.

- షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

అభివృద్ధివైపు అడుగులు



ఆస్పత్రి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. నాణ్యమైన వైద్యసేలకు అవసరమైన సౌకర్యాలు, వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. క్యాడర్ల వారీగా సిబ్బంది వివరాలు తెలియజేస్తున్నాం. 560 పడకల నుంచి వెయ్యి పడకలకు పెంచేలా దృష్టి సారించాం.

- ప్రొఫెసర్ ఆత్మారామ్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్

పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు



ఎంఎం హళ్లి గ్రామం వద్ద పీఏబీఆర్‌లోకి వెళ్తున్న కృష్ణాజలాలు

కూడేరు, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఏబీఆర్‌లోకి కృష్ణాజలాలు చేరుతున్నాయి. జీడిపల్లి రిజర్వాయర్ నిండిపోవడంతో గురువారం 2 వేల క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వదిలారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో నీటి మట్టం 426.900 అడుగుల వద్ద 1.875 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడంతో ఎంఎంహళ్లి గ్రామ సమీపాన వంకలో నీటి ఉధృతి పెరిగింది. పీఏబీఆర్‌లోకి నీరు చేరుతుండటంతో కుడికాలువ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీటెక్ ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలోని బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు గురువారం ఫలితాలను విడుదల చేశారు. జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పరిధిలో జూన్, జూలై నెలలలో నిర్వహించిన పరీక్షలు బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్20) అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండో సెమిస్టర్(ఆర్21), రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ ఒకటో సెమిస్టర్(ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ మొదటి సెమిస్టర్(ఆర్21)సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ, నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎ.పి.శివకుమార్, అడిషనల్ కంట్రోలర్ ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు కీలకం: వైవీ

శింగనమల, జూలై 31(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు కీలకమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి గత ఐదేళ్లలో కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకే జమ చేసుకుంది తప్ప.. అభివృద్ధికి నయాపైసా కూడా ఇవ్వలేదన్నారు. కూటమి పాలనలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు.

ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పనిసరి

అనంతపురం కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): క్రమబద్ధీకరణ కాని ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అహుడా అనుమతి తప్పనిసరి అని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ్ శర్మ స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా విభాగంలోని ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్‌ను ఎక్కువగా గుర్తించాలని ఆదేశించారు. ఎంఐజీ లేఅవుట్‌లలో అభివృద్ధిపై ఆరాతీశారు. అనంతపురం, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో చేపట్టిన చర్యలు, ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అహుడా అధికారులు పాల్గొన్నారు.

మార్గదర్శకుల గుర్తింపులో పురోగతి

పీ4 కార్యక్రమం కింద మార్గదర్శకుల గుర్తింపులో పురోగతి తీసుకొస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ్ శర్మ అన్నారు. ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ తదితరులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మార్గదర్శకుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల తరలింపు తదితర అంశాలపై శ్రద్ధ పెట్టామన్నారు.

బలహీన వర్గాల కోసమే టీడీపీ ఆవిర్భావం

- నందమూరి రామకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న నందమూరి రామకృష్ణ

బొమ్మనహాళ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): బడుగు, బ లహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పా ర్టీని దివంగత ఎన్టీఆర్ స్థాపించారని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ పేర్కొన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం మండల కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగువాడి పౌరుషాన్ని ఢిల్లీకి పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని కీర్తించారు. తెలుగువాడి సత్తాను చాటిచెప్పడానికి పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో కొనసాగుతుందని అన్నారు. అంతకుముందు ఆయన్ను కాలవ భరత్ శాలువతో సత్కరించి స్వాగతించారు. ఆయన వెంట టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీటీ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, టీడీపీ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, పయ్యావుల అనిల్ తదితరులు ఉన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ. 15వేల ధరతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరిగా రూ.10,100 పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1336 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఔట్ ఫ్లో 2 వేల క్యూసెక్కులు

బెళుగుప్ప, జూలై 31(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఔట్ ఫ్లో 2 వేల క్యూసెక్కులు వెళ్తున్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 2100 క్యూసెక్కులు వస్తోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.729 టీఎంసీల నీరు నిల్వ ఉందని వెల్లడించారు.

కొడుకుతో కలిసి భర్త హత్య

- ఆస్తి దక్కకుండా పోతుందనే దారుణం
- కారుతో ఢీకొట్టించి.. ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ
- నిందితుల అరెస్టు

గార్లదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆస్తి ఎక్కడ దక్కకుండా పోతుందోనని భర్తనే హత్య చేయించింది ఓ భార్య. కుమారుడితో కలిసి పథకం పన్ని కారుతో ఢీకొట్టించి, ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. పోలీసుల దర్యాప్తులో హత్యగా తేలడంతో నిందితులను అరెస్టు చేశారు. మండలంలోని జంబులదిన్నె గ్రామానికి చెందిన కోయిటాకు నల్లప్ప హత్య కేసులో అతడి భార్య లక్ష్మి, కుమారుడు ఆశ్రయ్ అలియాస్ ఆర్య, అక్క కుమారుడు కట్లపొడి శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతపురం డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. జంబులదిన్నె గ్రామానికి చెందిన నల్లప్ప, లక్ష్మి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. గతంలో తెలంగాణ రాష్ట్రం తాండూరు మండలం మల్రెడ్డిపల్లికి వలస వెళ్లినపుడు నల్లప్పకు ఆ ఊరికి చెందిన నవీనతో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయమై నల్లప్పతో భార్య గొడవ పడడంతో ఐదేళ్ల క్రితం స్వగ్రామానికి చేరుకున్నారు. అయినా నల్లప్ప.. నవీనతో సంబంధం కొనసాగిస్తుండడంతో భార్య మళ్లీ గొడవపడింది. నల్లప్ప ప్రవర్తనలో మార్పు రాకపోగా నవీనతో సంబంధాన్ని వదులుకోనని, భార్యకు విడాకులు ఇస్తానని తెగేసి చెప్పాడు. అదే జరిగితే ఆస్తి తన కుమారుడికి దక్కకుండా పోతుందేమోనని లక్ష్మి భావించింది. భర్తను హత్య చేయాలని భావించింది. కుమారుడు బోయ ఆశ్రయ్ అలియాస్ ఆర్య, అక్క కుమారుడు కట్లపొడి శ్రీకాంత్‌తో కలిసి పథకం పన్నారు. అందులో భాగంగా గత నెల 23న నల్లప్ప జంబులదిన్నె సమీపంలోని చీనీ తోటకు వెళ్లి ద్విచక్రవాహనంపై గార్లదిన్నె వైపు వస్తుండగా శ్రీకాంత్ అద్దెకు తెచ్చిన కారుతో ఢీకొట్టి వెళ్లిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నల్లప్ప అక్కడికక్కడే మరణించాడు. రోడ్డు ప్రమాదంగా భావించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని, లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంపై నల్లప్ప బంధువులు అనుమానాలు వ్యక్తం చేయడం, ఢీకొట్టి వెళ్లిపోయిన దొరకడంతో పోలీసులు హత్యగా నిర్ధారించారు. ఆ మేరకు లక్ష్మి, ఆశ్రయ్, కట్లపొడి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు. వారిని గురువారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా, సిబ్బంది గురుమూర్తి, అంజినేరెడ్డి, కృష్ణ, రామాంజి, దివాకర్, నగేష్, నరేష్, వెంకటేష్, చాగంటి వెంకటేష్, తిరుమలేసనాయుడు, రంగారెడ్డి, జిలాన్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

మోడల్ స్కూల్లో వాటర్ ప్లాంటు ప్రారంభం


ప్లాంటును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు ను టీడీపీ నాయకులు గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి మోడల్‌స్కూల్‌లో పాల్గొన్నప్పుడు అక్కడ వాటర్ ప్లాంటు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పరిటాల మెమోరియల్ ట్రస్టు ద్వారా ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, ఆవుల ముత్యాలు, విశ్వనాథ్, ఆంజనేయులు, పేపర్ శీన, చిన్న అక్కులప్ప, ప్రిన్సిపాల్ సర్వేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

అనంతపురం రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ, నలంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 650మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వివిధ కంపెనీలలో 161మంది ఉద్యోగాలు పొందినట్లు ఏపీఎస్ఎస్‌డీ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వీరికి అధికారులు నియామకపత్రాలు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ కేబీ చౌదరి, ప్రెసిడెంట్ భువనేశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు.. కేసు నమోదు

అనంతపురం క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద మహిళలను కొడుతుంటే.. ఓ వ్యక్తి అడ్డు చెప్పడంతో అతడిపై కూడా దాడి చేశారు. ఈ ఘటనపై గురువారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని పెన్నార్ భవన్ సమీపంలో వెంకట రమణ మ్మ అనే మహిళ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తోంది. బుధవారం రాత్రి ఆమె వద్ద పని చేసే స్వర్ణతో ఆమె భర్త కుళ్లాయప్ప గొడవ పెట్టుకున్నాడు. దీంతో గొడవ వద్దని వెంకటరమణమ్మ వారించగా.. అతను ఆమెపై దాడి చేశారు. అదే సమయంలో అక్కడికి ఫాస్ట్ ఫుడ్ తినడానికి వచ్చిన మాధవరాజు అలియాస్ మధు ఆడవాళ్లను ఎందుకు కొడుతావు అంటూ అడ్డుపడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటమాటా పెరడంతో మధుపైన కూడా కుళ్లాయప్ప చేయి చేసుకున్నాడు. దీంతో బాధితులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

అనంతపురంరూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న జయంతి, వర్థంతిని ప్రభుత్వమే నిర్వహించాలని గౌడకులస్థులు, నాయకులు కోరారు. జిల్లా కేంద్రానికి గురువారం వచ్చిన రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తిగౌడ్‌ను గురువారం వారు కలిసి ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఈడిగ సాధికారిక సమితి సభ్యుడు ఈడిగ వేణుగోపాల్ గౌడ్, ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షులు నారాయణస్వామి, రామకృష్ణ, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు 600 మంది హాజరు

అనంతపురం టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో గురువారం నగర శివారులోని ఇస్కాన్ మందిరంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శ్రీకృష్ణుడి లీలలపై వ్యాసాలు రాశారు. పోటీలను ఇస్కాన్ మందిర ఛైర్మన్ దామోదర్ గౌరంగదాస్ పర్యవేక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు కృష్ణాష్టమి పర్వదినాన జ్ఞాపికలు బహూకరించడంతోపాటు పోటీదారులందరికీ ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

కనగానపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని మండలానికి చెందిన టీడీపీ బీసీ నాయకులు అన్నారు. మండలకేంద్రంలోని పరిటాల భవన్‌లో గురువారం టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ మాధవరాజు, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, నాయకులు రాజాక్రిష్ణ, అంకే రామక్రిష్ణ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు న్యాయం చేసేది ఒక్క టీడీపీనేని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ బీసీల గురించి పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు మాత్రం మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి బీసీలపై కపట ప్రేమ చూపుతున్నారని మండిపడ్డారు. అంతకుముందు డీసీఎంఎస్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి మాట్లాడుతూ టీడీపీలో పదవులపై మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని అన్నారు.

తోపుదుర్తి సోదరులను ఎవరూ నమ్మరు

ఆత్మకూరు జూలై 31(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతడి సోదరులు అధికారంలో ఉన్నంతకాలం దోచుకుని దాచుకున్నారని, ఇప్పుడేమో ప్రజలంటే ఎంతో ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని, వారిని నమ్మే స్థితిలో ఎవరూ లేరని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. మండలకేంద్రంలో పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ఇది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజలు 11సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదన్నారు. సానుభూతితో ప్రజలు ఒక సారి అధికారం ఇస్తే తోపుదుర్తి సోదరులు ఐదేళ్ల ప్రజలను దోచుకుతిన్నారని మండిపడ్డారు. అధికారం కోల్పోయాక పరిటాల కుటుంబంపై విమర్శలు చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి పాల రైతులకు రూ. 3కోట్లు ఎగనామం పెట్టారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలను, ప్రజలను పక్కన పెట్టారని, ఇప్పుడు కపటప్రేమ చూపుతున్నారని దుయ్యబట్టారు. వారిని నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ హనుమప్ప చౌదరి, నాయకులు శ్రీనివాస రెడ్డి, అశ్వర్థప్ప పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

అనంతపురంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక రామ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మూడురోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, శ్రీవారి కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహన సేవ జరిపారు. ఈ సందర్భంగా చేపట్టిన నగరోత్సవంలో సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ దేవరకొండ కౌసల్య బృందం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు కన్నులపండవగా సాగాయి. పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహాల నడుమ కోలాటం వేశారు. ఊరేగింపు ముగిసిన తర్వాత మహా మంగళ హారతి ఇచ్చి అన్నప్రసాద వితరణ చేశారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

క్రమశిక్షణతో చదవాలి

- విద్యార్థులకు డీఈఓ ప్రసాద్‌బాబు సూచన
- పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల తనిఖీ


పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

అనంతపురం విద్య, జూలై 31(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసించి మంచి ఫలితాలు సాధించాలని డీఈఓ ప్రసాద్‌బాబు విద్యార్థులకు సూచించారు. నగరంలోని పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నతపాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. తొలుత విద్యార్థులు, టీచర్ల హాజరు పరిశీలించారు. అనంతరం క్లాస్ రూమ్‌లకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. టీచర్లు పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోజూ క్రమం తప్పకుండా బడికి రావాలని, క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంటకస్వామి, ఏపీఓ మంజునాథ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

- శిక్షణ ముగింపులో ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ

అనంతపురం విద్య, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్రే కీలకమని ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ అన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని ఇంటెల్ కాలేజీలో హెచ్‌ఎంలకు నాయకత్వ లక్షణాలపై ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఇందులో ఏపీసీ శైలజ పాల్గొని మాట్లాడారు. ఎక్కడ ఏది అభివృద్ధి చెందాలన్నా నాయకుడు బాగుంటేనే సాధ్యమవుతాయన్నారు. పాఠశాలల అభివృద్ధిలో హెచ్‌ఎం పాత్ర కీలకం కాబట్టే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాలనతో పాటు రికార్డులు, రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించాలన్నారు. టీచర్లతో సమన్వయంతో సాగి పిల్లలకు మంచి విద్యాబోధన అందేలా చూడాలని హెచ్‌ఎంలకు ఆమె సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏఎంఓ ఫణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీసీ శైలజ

నేడు పాపంపేటకు ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట గ్రామానికి ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం రానున్నట్లు ఎంపీడీఓ దివాకర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్ గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉదయం 7గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆమె పాల్గొనున్నట్లు చెప్పారు.

రిటైర్డ్ డీసీహెచ్‌ఎస్‌కు ఘన సన్మానం


డాక్టర్ పాల్ రవికుమార్ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

అనంతపురం వైద్యం, జూలై31(ఆంధ్రజ్యోతి): డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ గురువారం రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా సీడీ ఆస్పత్రిలోని గిరిజన భవన్‌లో ఆయనకు సన్మానసభను ఏర్పాటుచేశారు. డాక్టర్ పాల్ రవికుమార్ దంపతులను డాక్టర్లు సైదన్న, మాధవి, ప్రసన్నభారతి, అన్నపూర్ణ, యల్లప్ప, లింగన్న, విజయలక్ష్మి, చౌదరి, పుట్టపర్తి డీసీహెచ్ఎస్ మధుసూదన్, సీడీ ఆసుపత్రి డాక్టర్లు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ప్రభుత్వం తరఫున ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ్ శర్మ, డీఆర్వో మలోలు, అసిస్టెంట్ కలెక్టర్ తదితరులు డాక్టర్ పాల్ రవికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎ్స ఎఓ శ్రీనివాసులు, ఏఓ జగదీష్ నాయక్, ఆఫీస్ సూపరిండెంట్ దొరస్వామి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్‌గా డేవిడ్ సెల్వన్‌రాజు...

డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ రిటైర్డ్ అవడంతో ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ డేవిడ్ సెల్వన్‌రాజు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం తాడిపత్రి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు.

చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌కు సన్మానం...

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఈశ్వర్‌రెడ్డి రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్‌లోని ఐఎంఏ పక్షన్‌హాల్లో ఈశ్వర్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. అనస్తీషియా ప్రొఫెసర్ సుబ్రమణ్యం, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ఏపీఎన్‌జీఓ నాయకులు, పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు..

కనగానపల్లి: మండలంలోని చంద్రాచర్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు పుల్లప్ప, హైదర్‌వలీ, భ్రమరాంబ ఇటీవల వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఇందుకు వారిని పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్థులు గురువారం పూలవూలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం మేడా నాగసురేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాకీ కిట్ వితరణ..

తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్థానికుడైన బంగి పవన్ హాకీ కిట్‌ను వితరణ చేశారు. ఉద్యోగరిత్యా స్విట్జర్‌లాండ్‌లో ఉంటున్న ఆయన ఇటీవల గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో విద్యార్థులకు రూ. 40 వేలు విలువైన కిట్‌ను అందజేశారు. హెచ్‌ఎం వివేకనందమూర్తి, సర్పంచ్ మాధవరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు ఘన సన్మానం

అనంతపురం టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజనల్ మేనేజర్‌గా రిటైర్డ్ అయిన సుమంత్ ఆర్ ఆదోనికి గురువారం ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులతోపాటు కార్యాలయ సిబ్బంది చాంబర్‌లో కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

ఇన్‌చార్జి ఆర్‌ఎంగా శ్రీలక్ష్మి..

అనంతపురం ఆర్టీసీ ఆర్‌ఎంగా సుమంత్ ఆర్ ఆదోని ఉద్యోగ విరమణ పొందగా.. ఆయన స్థానంలోకి అనంతపురం ఆర్‌ఎం కార్యాలయంలో డిప్యూటీ సీటీఎంగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీలక్ష్మికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఆర్టీసీ ఈడీ రవి ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐకి..

అనంతపురం క్రైం: ఉద్యోగ విరమణ పొందిన నాలుగో పట్టణ ఎస్ఐ అల్లాబకాష్‌ను ఎస్పీ జగదీష్ తన కార్యాలయంలో గురువారం పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు దశాబ్ధాలుగా అల్లాబకాష్ పోలీస్‌శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించాలి

అనంతపురం అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ప్రకృతి వ్యవసాయం విభాగం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక ఆర్‌డీటీ ఎకాలజీ సెంటర్‌లో గత 8 రోజులుగా పలు జిల్లాల ప్రకృతి వ్యవసాయం డీపీఎంలు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన శిక్షణ ముగింపునకు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ హాజరై మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు లాభాలు ఆర్జించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సరైన పద్ధతులు పాటించి, పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు రావడంతో పాటు రైతులకు లాభాలు వస్తాయన్నారు. శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించి, ప్రకృతి వ్యవసాయంవైపు వారంతా అడుగులు వేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు డీపీఎం, సిబ్బందికి శిక్షణ తీసుకున్నట్లు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


పీఆర్ చాంబర్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

అనంతపురం న్యూటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. జిల్లాకేంద్రంలో గురువారం వారు పంచాయతీరాజ్ చాంబర్ ఛైర్మన్ రాజేంద్రప్రసాద్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి ఛైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, కార్యదర్శులు కమల కరుణ, రాఘవేంద్ర, రఘు, బెన్నీ బాబు, హరినాథ్, నవీన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఎవరూ కరుణించలేదు: వైసీపీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, వారిని అటు పాలకులు, ఇటు వరుణుడూ కరుణించలేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాదిలానే ఈఏడాది కూడా ఉమ్మడి జిల్లా కరువు కోరల్లో చిక్కుకుందన్నారు. ఖరీఫ్ ప్రారంభంలో అరకొరగా వర్షాలు కురిస్తే వేరుశనగ, పత్తి, ఆముదం, కందులను రైతులు సాగు చేశారని, ఇప్పుడు వర్షాలు కరవకపోవడంతో ఆ పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 15 లక్షల ఎకరాలుందని, ఇప్పటివరకు 3.94లక్షల ఎకరాల్లోనే వివిధ పంటలు సాగు చేశారని అన్నారు. వేరుశనగ 8లక్షల ఎకరాలకు పైగా సాగు చేసేవారని, కానీ ఇప్పుడు 1.63లక్షల ఎకరాల్లోనే సాగు చేశారన్నారు. వర్షాభావ పరిస్థితులపై జిల్లాలోని మంత్రులు, ఎంపీలు,ఎమ్మెల్యేలు ఆలోచన చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారుల నుంచి కలెక్టర్ వరకు కరువు పరిస్థితుల నుంచి ఎలా బయట పడాలో ప్రణాళికరూపొందించుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మంత్రులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయంపై సమీక్ష చేయాలన్నారు. వైఎస్ జగన్ ప్రజల వద్దకు వెళ్తుంటే ప్రభుత్వం భయపడిపోతోందన్నారు. జగన్ పర్యటనకు వస్తుంటే జనం రాకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు.

గవర్నమెంటోళ్లకే ప్రాధాన్యమివ్వడం దారుణం

అనంతపురం విద్య, జూలై31(ఆంధ్రజ్యోతి): ఖాళీపడిన ఎంఈఓ-1 పోస్టులను కేవలం గవర్నమెంట్ యాజమాన్యం టీచర్లకే అంటూ జూనియర్ స్కూల్‌అసిస్టెంట్లకు కట్టబెట్టడం అన్యాయమని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, జిల్లాప్రధానక్యాదర్శి రవీంద్రనాథ్‌గురువారం ఓప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రకమిషనర్ ఉత్తర్వులపై అభ్యంతరాలు తీసుకోవాలని కోరినా ఏమాత్రం పట్టించుకోకుండా అప్పటికప్పుడే ఆగమేఘాలమీద గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ స్కూల్‌అసిస్టెంట్‌లకు ఇంచార్జి బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయమన్నారు. దీన్నిబట్టి చూస్తే పంచాయతీరాజ్ టీచర్ల పట్ల విద్యాశాఖ అధికారులు వివక్షత చూపుతున్నట్లు కనబడుతోందన్నారు. స్కూల్‌అసిసెంట్లకు ఎంఈఓ-1 పోస్టులు ఇచ్చి ఆపోస్టుకు ఉన్న విలువలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని వారు కోరారు.

రైతులకు మరింత చేరువగా ఏడీసీసీబీ సేవలు

- ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి



ముంటిమడుగు కేశవరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని రైతులకు సహకార కేంద్రబ్యాంకు, సొసైటీల సేవలను మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో అధునాతన హంగులతో ఆధునీకరించిన కార్యాలయంలోకి గురువారం ఆయన ప్రవేశించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ... కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ప్రధాన కార్యాలయంతో పాటు అత్యధిక పురోగతి సాధించిన మూడు బ్రాంచ్‌లు, మూడు సొసైటీలను ఆధునీకరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు, ఖాతాదారులు, డిపాజిటర్లకు తమ బ్యాంకుపై నమ్మకం, విశ్వాసాన్ని రెట్టింపు చేయడానికి ప్రయత్నిస్తామని అన్నారు. అనంతరం పలువురు నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేశులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్‌సీ పరమేశ్వర్, టీడీటసీనియర్ నాయకులు దొర్రై, వెంకటేష్, ఆదినారాయణ, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు ఏటీ రాంప్రసాద్, సుఖదేవ్‌బాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో ప్రతిభ చాటిన ధర్మవరపు మేఘన


లండన్‌లో ప్రశంసాపత్రం అందుకుంటున్న ధర్మవరపు మేఘన

అనంతపురం విద్య/రాప్తాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్శిటీలో జిల్లాకు చెందిన విద్యార్థిని ధర్మవరపు మేఘన సత్తా చాటారు. మార్కెటింగ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ చేసిన ఆమె ప్రతిభ చాటి నాలుగో స్థానంలో నిలిచారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మేనకోడలు, ధర్మవరపు బాలాజీ, ప్రియసుధ దంపతుల కూతురు మేఘన. ఆ యూనివర్శిటీ కులపతి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే


తిరుమలలో కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే

శింగనమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం దర్శించుకున్నారు. తల్లిదండ్రులు బండారు రవికుమా ర్, బండారు లీలావతి, అక్క కిన్నెరశ్రీ, బావ సాయి కలిసి స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవున్ని వేడుకున్నట్లు తెలిపారు.

ఏజెంట్ ఇంటి ఎదుట చీటీదారుల బైఠాయింపు

అనంతపురంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట పంచాయతీ వైఎస్సార్‌కాలనీలో ఓ చీటీల ఏజెంట్ ఇంటి ముందు చీటీదారులు గురువారం బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాలనీకి చెందిన రమేష్ కొన్నేళ్లుగా చీటీలు నడుపుతున్నారన్నారు. నమ్మకం ఉండటంతో పెద్ద ఎత్తున చీటీలు వేశామన్నారు. అయితే ఎనిమిది నెలల నుంచి చీటీలు ఎత్తిన వారికి డబ్బులు ఇవ్వడం లేదన్నారు. పొంతన లేని సమాధానంతో కాలయాపన చేస్తున్నాడన్నారు. గత్యంతరం లేక ఇంటి ముందు బైఠాయించాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో చీటీదారులు కృష్ణవేణి, రాజు, రామణారెడ్డి, శ్రీనివాసులు, పద్మ, రాజేశ్వరి, అయేషా, జయమ్మ, రేవతి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ట్రస్టు చేయూత

అనంతపురం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిరుపేద యువకుడి వివాహం కోసం సాయి ట్రస్టు చేయూతనిచ్చింది. రాయదుర్గానికి చెందిన దాసు అనే యువకుడి తండ్రి కొన్ని నెలల క్రితం మృతిచెందాడు. తల్లి కేన్సర్‌తో బాధపడుతూ నిస్సహాయ స్థితిలో ఉంది. కాగా సదరు యువకుడి కి వివాహ కుదరగా.. అతడు వివాహానికయ్యే ఖర్చుకోసం సాయి ట్రస్టును ఆశ్రయించారు. స్పందించిన ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ గురువారం జరిగిన ఆయువకుడి వివాహానికి హాజరై బంగారు మాంగళ్యం, పట్టువస్త్రాలు, ఒడిబియ్యం తదితర సామగ్రిని అందజేశారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు

గార్లదిన్నె, జూలై 31(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. గురువారం సాయంత్రం గార్లదిన్నెలో డాబాలో మందు సేవిస్తున్న వారిని ఆయన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవతున్నారన్నారు. డాబాలు, పబ్లిక్ స్థలాలో మద్యం సేవించరాదని హెచ్చరించారు. డాబాలలో మద్యం సేవిస్తే డాబాల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ద్విచక్ర వాహనాలపై, కార్లపై పోలీసులు, ప్రెస్ కాకపోయిన కొంతమంది పోలీస్, ప్రెస్ స్టిక్కర్లు అతికించుకుంటున్నారన్నారు. అలా అతికించుకోవడం నేరమన్నారు. పోలీస్, ప్రెస్ కాకపోయిన స్టిక్కర్లు అతికించుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మట్కా బీటర్ అరెస్టు

అనంతపురం క్రైం, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయి నగర్ 8వ క్రాస్‌లో మట్కా బీటర్‌ను టూ టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అంబేడ్కర్ భవన్ సమీపంలో ఓ వ్యక్తి మట్కా చిట్టీలు రాస్తున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి ఆ వ్యక్తిని అరెస్టు చేశారు. అనంతరం అతడి నుంచి రూ.3 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఉపాధి పనులకు జియో ట్యాగింగ్ తప్పనిసరి

అనంతపురం అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో చేపట్టే పనులకు జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ తప్పని సరిగా చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు. స్థానిక డ్వామా కార్యాలయంలోని సమావేశపు హాల్లో గురువారం ఆయన ఎంపిక చేసిన ఈసీ, జేఈ, టెక్నికల్ అసిస్టెంట్లకు జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ మొబైల్ యాప్ ప్రత్యేక అప్లికేషన్‌పై శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి నిధులతో చేపట్టే పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. సామాజిక తనిఖీలోనూ ఈ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగానే ముందస్తుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తైన తర్వాత త్వరలో క్షేత్ర స్థాయిలో ఈ ప్రక్రియ మొదలు పెట్టనున్నామన్నారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, ఏపీడీ విజయ్‌కుమార్, జీఐఎస్ రీజనల్ మేనేజర్ కుసుమకుమారి, అడిషనల్ డిస్ట్రిక్ రిసోర్స్‌పర్సన్ రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీం బాషా

గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల గ్రామంలో మీ సమస్యామా బాధ్యత (గ్రీవెన్స్)కార్యక్రమాన్ని అధికారులు గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్. నారాయణ చౌదరి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. పింఛన్లు, గృహాలు, ఇంటిస్థలాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి అధికంగా అర్జీలు వచ్చాయన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించడానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. ప్రజల సమస్యలను తమ బాధ్యతగా తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అధికారులు కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగే రామగిరి మండలం పెద్దకొండాపురంలో, అనంతపురంరూరల్ మండలం కక్కలపల్లి కాలనీ, తాటిచెర్ల గ్రామాల్లో , రాప్తాడు మండలం బండమీదపల్లిలో మీ సమస్యామా బాధ్యతను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, మండలాల ప్రజాప్రతినిధులు, టీడీపీ మండలాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శిలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


ముష్టికోవెలలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎల్ నారాయణచౌదరి

న్యూస్ బాక్స్

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ఉరవకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దముష్టూరులో సుంకులమ్మదేవి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

త్వరలో స్వమిత్వ సర్వే

యాడికి, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్వమిత్వ యోజనలో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద మండలంలోని పది గ్రామాల్లో త్వరలో ఆస్తి సర్వే చేస్తామని డిప్యూటీ ఎంపీడీఓ శశికళ గురువారం తెలిపారు. మండలంలోని గుడిపాడు, కమలపాడు, కోనుప్పలపాడు, నగరూరు, నిట్టూరు, ఓబులాపురం, పుప్పాల, తిరుణాంపల్లి, తూట్రాళ్లపల్లి, వేములపాడు గ్రామాల్లో డ్రోన్లు, రోవర్లు లాంటి టెక్నాలజీతో ప్రతి ఇంటిని సర్వే, మ్యాపింగ్ చేస్తామని, ఆస్తి డేటాను సేకరిస్తారని తెలిపారు. సామాజిక, ఆర్థిక, సాధికారతను, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఆస్తి సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు.

ఎస్ఎఫ్ఐ కార్యవర్గం ఏర్పాటు

గుత్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ధనుంజయ, సహాయ కార్యదర్శులుగా హాఫీజ్, అఖిల్, ఉపాధ్యక్షులు బాషా, శరత్‌కుమార్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

కంబదూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం పాతూరు ఉన్నత పాఠశాల్లో-2లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న ఉమాపతి కంబదూరు ఎంఈఓ-1 గా గురువారం బాధ్యతలు చేపట్టారు. కళ్యాణదుర్గం ఎంఈఓ విజయకుమారి ఇన్నాళ్లుగా ఇన్‌చార్జ్ ఎంఈఓ-1గా విధులు నిర్వహించేవారు.

● ఎస్ఐగా లోకేశ్: కంబదూరు ఎస్ఐగా లోకేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు నుంచి వీఆర్‌లో ఉంటూ కంబదూరుకు బదిలీ చేశారు. ఇక్కడి ఎస్ఐ ప్రవీణ్‌ను అనంతపురం స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

● ట్రైనీ ఎస్ఐగా మహేష్

బెళుగుప్ప: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా జీ మహేష్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన కర్నూలు జిల్లా నుంచి ఇక్కడకు ఐదు నెలల పాటు శిక్షణ పొందేందుకు వచ్చారని ఎస్ఐ శివ తెలిపారు.

● ఇన్‌చార్జి ఎంఈఓగా శంకరన్న

కుందుర్పి : ఇన్‌చార్జి ఎంఈఓగా కే శంకరన్న బాధ్యతలు స్వీకరించారు. రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అతనికి మండల విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఈఓ ఆదేశాలు జారీ చేశారు.

● ఎంఈఓగా సోమశేఖర్

గుమ్మఘట్ట: మండల విద్యాధికారిగా సోమశేఖర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కళ్యాణదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సోమశేఖర్‌ను ఉద్యోగోన్నతిపై ఎంఈఓగా ఇక్కడ నియమించారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



కార్యక్రమంలో పాల్గొన్న కాలవ భరత్, నాయకులు

గుమ్మఘట్ట, జూలై 31(ఆంధ్రజ్యోతి):పూలకుంటలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, రాయదుర్గం వాల్మీకి సంఘం గౌరవ అధ్యక్షుడు బండి క్రిష్టప్ప, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, నాయకులు కేపీదొడ్డి నాగరాజు, బేలోడు సంజీవ, చెన్నప్ప, వెంకటేశులు, రాముడు, సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

తాడిపత్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని వైస్‌చైర్మన్ అరుణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 26 అజెండాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. జేసీపీఆర్ మాట్లాడుతూ.. ప్రతి కౌన్సిలర్ వార్డుల్లో పర్యటించి సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు.

కసాపురంలో గోవులకు వ్యాక్సిన్

గుంతకల్లుటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలోని గోశాలలోని గోవులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనిమల్ అండ్ హస్బెండరీ సిబ్బంది గోవులకు లంపి స్కిన్ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కే వాణి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

● ధన్వంతరి హోమం : కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలోని యాగశాలలో ధన్వంతరి హోమం నిర్వహించారు. ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తికి పూజలు చేశారు.

వెండి వితరణ

గుంతకల్లు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కసాపురం ఆంజనేయస్వామి దేవస్థానానికి పట్టణానికి చెందిన నాగేశ్ అర కేజీ వెండిని గురువారం అందజేశారు. దాన్ని తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ అధికారులకు అందజేశారు.

ఆలయ గోపుర నిర్మాణానికి అంచనాలు

కణేకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం గ్రామంలో ఉన్న బసవేశ్వరస్వామి ఆలయ గోపుర నిర్మాణానికి దేవాదాయశాఖ అధికారులు గురువారం అంచనాలు తయారు చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ఈ పనులు ప్రారంభిస్తామని దేవాదాయశాఖ ఈఓ దేవదాసు, ఏఈ హరిత తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త విజయ్‌కుమార్, గ్రామపెద్దలు శరభనగౌడ్, ప్రభాకర్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, మహేష్, నరేంద్రస్వామి, శివ, రాము పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పామిడి, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వాణి నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ గురువారం ప్రారంభించారు. పట్టణంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి 10 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ మధుసూదన్, టీడీపీ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్ చౌదరి, సంజీవకుమార్, మాలిక్, రామాంజనేయులు, శివ, సురేష్‌రెడ్డి, మోహన్‌కృష్ణ, దాదా, బాబా, నిరంజన్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు

ఇంత నిర్లక్ష్యమా..!

● కాలువ విస్తరణతో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



కాలువ మధ్యలో, గట్టున ఒరిగిన విద్యుత్ స్తంభాలు

గుంతకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా వైడెనింగ్‌లో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో నేడు అవి ప్రమాదకరంగా మారాయి. హంద్రీనీవా కాల్వలో 154.800 కిలీమీటర్ వద్ద రెండు విద్యుత్ స్తంభాలను షిఫ్ట్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. జలవనరుల శాఖ ఇంజనీర్లు, సంబంధిత కాంట్రాక్టు సంస్థ రెండు నెలలుగా పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు లిఖితపూర్వక విజ్ఞప్తులు చేశారు. కానీ ఫలితం లేకపోయింది. చేసేదిలేక జలవనరుల శాఖాధికారుల సూచనలతో సంబంధిత కాంట్రాక్టు సంస్థ కరెంటు పోల్‌కు చుట్టూ కొంత స్థలాన్ని వదిలేసి కాల్వలో మట్టిని తొలగించి వైడెనింగ్ పనులు చేశారు. దీంతో హంద్రీనీవా కాల్వ మధ్యలో ఒక విద్యుత్ స్తంభం, కాలువ గట్టు అంచున మరో విద్యుత్ స్తంభం మిగిలిపోయాయి. హంద్రీనీవాకు నీరు వదిలినా.. విద్యుత్ శాఖాధికారుల నుంచి ఏ మాత్రం స్పందన లేకుండాపోయింది. నీటి ప్రవాహానికి ఆ విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న మట్టి కోతకు గురవుతోంది. దీంతో విద్యుత్ స్తంభం ఒకవైపునకు ఒరిగిపోతోంది. ఈ విద్యుత్ స్తంభం పూర్తికి ఒరిగిపోతే హైఓల్టేజీ విద్యుత్ వల్ల పెను ప్రమాదం జరిగే పరిస్థితులున్నాయి. దీనిపైన హంద్రీనీవా గుంతకల్లు ఇంజనీరింగ్ ఏరియా ఈఈ శ్రీనివాస నాయక్‌ను వివరణ కోరగా.. కాల్వ మధ్యలో, గట్టున ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని రెండు నెలలుగా ట్రాన్స్‌కో అధికారులకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నామని, కాల్వకు నీరు వచ్చే లోపు వాటిని పక్కకు మార్చి ఉంటే ఇబ్బంది ఉండేది కాదని అన్నారు. ఇప్పుడు విద్యుత్ స్తంభం ఒరిగిపోతోందని, వెంటనే తొలగించకుంటే ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయని అన్నారు.

ఐదు చెరువులకు నీటి విడుదల



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గుత్తి, ములకలపెంట, బ్రాహ్మణపల్లి, కొంగనపల్లి, వైటీ చెరువులకు, పత్తికొండ నియోజకవర్గంలోని చెరువులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హంద్రీనీవా నీటిని గురువారం విడుదల చేశారు. పత్తికొండ నియోజకరవర్గంలోని మద్దికెర మండలం ఎడవలి గ్రామం వద్ద హంద్రీనీవా కాల్వకు జలహారతి ఇచ్చి, తూమును తెరచి చెరువులకు నీటిని వదిలారు. అనంతరం గుంతకల్లు మండలంలోని జీ కొట్టాల వద్ద జీబీసీ పరిధిలోని ఆలూరు బ్రాంచ్ కాలువకు హంద్రీనీవా నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, తలారి మస్తానప్ప, యుగంధర్, రామన్న చౌదరి పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ: నియోజకవర్గంలోని 24 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 9,78,221 మంజూరైంది. ఆ చెక్కులను బాధితులకు గుంతకల్లు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటిదాకా సీఎంఆర్ఎఫ్ రూ.2.01 కోట్లను పంపిణీ చేశామన్నారు. ఇందులో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, చికెన్ జగన్, గుణశేఖర్, ఫజులు, రామన్న చౌదరి, యుగంధర్, శివన్న, శ్రీరాములు, మత్రునాయక్ పాల్గొన్నారు.

ఘనంగా నాగుల ప్రతిష్ఠ



విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న పండితులు

గుంతకల్లు/టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అశ్వత్థనారాయణ కట్ట వద్ద నాగుల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ప్రతిష్ఠ, అశ్వత్థనారాయణ స్వామి కల్యాణం, హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ యాదవ సంక్షేమాభివృద్ధి ఫెడరేషన్ డైరెక్టర్ ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, నాయకులు ఎల్లప్ప, బురుజుల ఎర్రిస్వామి, దామోదర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తుది విడత కౌన్సిలింగ్ ముగిసిన నేపథ్యంలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులలో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్స్ విధానం ద్వారా భర్తీ చేస్తున్నట్లు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్ అయిన వారు మంగళవారం లోపు పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు అందజేయాలని, వివరాలకు 90102 22165ను సంప్రదించాలని అన్నారు.

అంధకారంలో మల్లాపురం

రాయదుర్గంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మూడు రోజులుగా కరెంట్ లేదు. దీంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ బీమా పథకం కింద ప్రీమియం చెల్లింపు చివరిరోజు కావడంతో గురువారం సచివాలయం, రైతుసేవా కేంద్రాల వద్ద రైతులు క్యూ కట్టారు. కరెంట్ లేకపోవడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేకపోయారు.

స్టాక్‌పాయింట్ తనిఖీ

గుంతకల్లుటౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టాక్ పాయింట్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు గురువారం తనిఖీ చేశారు. అలాగే బళ్లారి రోడ్డులోని బఫర్ పాయింట్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ తనిఖీ చేశారు. వీరి వెంట తహసీల్దార్ రమాదేవి, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

రస్తా స్థలం పరిశీలన.. మండలంలోని తిమ్మాపురంలో పొలం రస్తా విషయంపై గతంలో రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేస్వామి నాయక్, తహసీల్దార్ రమాదేవి గురువారం రస్తాకు సంబంధించిన పాస్ పుస్తకాలను పరిశీలించారు.

చారిత్రాత్మక ప్రదేశంలో అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని పురావస్తు, మున్సిపల్ అధికారులు

గుత్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): గుత్తి కోట వద్ద నుంచి 300 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని పురావస్తు శాఖ నిబంధనలు విధించింది. అయితే ఆ నిబంధనలు తుంగలో తొక్కి కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. కోటకు పోయే దారిలో ప్రధాన కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఓ వ్యక్తి ఏకంగా పురావస్తు శాఖ కార్యాలయం పక్కనే ఇంటికి ప్రహరీ నిర్మించుకుంటున్నాడు. తాడిపత్రి రోడ్డులో గుత్తికోటను ఆనుకొని పలువురు భవనాలను నిర్మిస్తున్నారు. పురావస్తు, మున్సిపల్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్పా.. ఆ నిర్మాణాలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై పురావస్తు శాఖ ఎంటీఎస్ షారున్ సత్యను వివరణ కోరగా.. తమ ఉన్నతాధికారి కన్సర్వేషన్ అసిస్టెంట్ యోగేష్ మౌఖికంగా అనుమతులు ఇచ్చారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాను వివరణ కోరగా.. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశామని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించామని అన్నారు.



కాలువపై, పురావస్తు కార్యాలయం పక్కన నిర్మాణాలు

637 మందికి కొత్త పింఛన్లు: విప్



ఇంటింటి ప్రచారంలో విప్ కాలవ

రాయదుర్గం, జూలై 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 637 మందికి కొత్తగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ మంజూరైనట్లు విప్ కాలవ శ్రీనివాసులు గురువారం తెలిపారు. రాయదుర్గం పట్టణానికి 91, బొమ్మనహాళ్‌కు 112, డీ.హీరేహాళ్‌కు 110, గుమ్మఘట్టకు 125, కణేకల్లుకు 121, రాయదుర్గం మండలానికి 78లోని మందికి రూ. 25.54 లక్షలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

● ఇంటింటి ప్రచారం: పట్టణంలోని 25వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విప్ కాలవ శ్రీనివాసులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ వెంకటేశులు ఉన్నారు.

కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే



ఏ. కొండాపురం వద్ద కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పుట్లూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురంలో ఉన్న హెచ్చెల్సీ కాలువను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కాలువలో దిగి గేట్లను పరిశీలించారు. కాలువలో ఉన్న చెత్తచెదారం తీసివేసి, మరమ్మతు పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

● పెద్దపప్పూరు : మండలంలోని చాగల్లు ప్రాజెక్ట్ నుంచి ఫ్లోడ్ కెనాల్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ.. సమస్యలుంటే తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఆయన వెంట జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బీసీ రామకృష్ణారెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడిపత్రి : నియోకవర్గంలోని తొమ్మిది మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.7,66,064 మంజూరైంది. ఆ చెక్కులను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి స్థానిక తన నివాసంలో ఆ బాధితులకు అందజేశారు.

గవిమఠం ఆస్తులను కాపాడుకుంటాం: ఉత్తరాధికారి

ఉరవకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని రూ.కోట్ల విలువైన గవిమఠం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటామని గవిమఠం ఉత్తరాధికారి కరిబసరాజేంద్ర స్వామి స్పష్టంచేశారు. స్థానిక గవిమఠంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలోని చిత్రదుర్గ్ జిల్లా కృష్ణరాజపురంలో దూపదీప నైవేద్యాల కోసం ఇచ్చిన భూమిని అర్చకులు అక్రమంగా వారిపేరు మీదకు మార్చుకున్నట్లు గుర్తించామని, రెవెన్యూ అధికారులకు ఆధారాలు చూపించి ఆ ఆస్తిని ఉరవకొండ గవిమఠం సంస్థానానికి చెందినదిగా నిరూపించామని అన్నారు. ఆ అర్చకులు పేరు మీద ఉన్న ఆ భూమిని గతనెల 15న ఉరవకొండ గవిమఠం పేరును మార్చామన్నారు.

పౌరహక్కులపై అవగాహన

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: సివిల్ రైట్స్ డే సందర్భంగా పలు ప్రాంతాల్లో అధికారులు ప్రజలకు చట్టాలు, హక్కులపై గురువారం అవగాహన కల్పించారు. బెళుగుప్ప మండలంలోని అంకంపల్లి ఎస్సీ కాలనీలో తహసీల్దార్ అనీల్ కుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట ఆర్డీటీ కాలనీలో తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో, శెట్టూరు మండలంలోని ఐదుకల్లు గ్రామం ఎస్సీ కాలనీలో ఎస్ఐ రాంభూపాల్, డిప్యూటీ ఎంపీడీఓ రఘురాం ఆధ్వర్యంలో, బ్రహ్మసముద్రం మండలంలోని బుడిమేపల్లిలో తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ రంగనాయకులు ఆధ్వర్యంలో, పుట్లూరు మండలంలోని చింతకుంట గ్రామంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో, పెద్దవడుగూరు మండలంలోని గుత్తిఅనంతపురం ఎస్సీకాలనీలో తహసీల్దార్ ఉషారాణి, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డిస్ట్రిబ్యూటరీలకు నీరు విడుదల

ఉరవకొండ, జూలై 31(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి సంబంధించిన 9, 10 డిస్ట్రిబ్యూటరీలకు అధికారులు, సాగునీటి సంఘం నాయకులు గురువారం పూజలు నిర్వహించి.. నీటిని విడుదల చేశారు. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో ఏఈ నజీరుద్దీన్, సాగునీటి సంఘం అధ్యక్షుడు సుంకన్న, టీడీపీ నాయకులు తిప్పారెడ్డి, రాజాల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● విడపనకల్లు: మండలంలోని పాల్తూరు, గాజుల మల్లాపురం గ్రామాల పరిధిలోని పది డిస్ట్రిబ్యూటరీల ద్వారా పంట పొలాలకు సాగు నీరును గురువారం విడుదల చేశారు.

కళింగర సాగుతో కాసులే..!



దిగుబడి చూపిస్తున్న రైతు రమేశ్

బెళుగుప్ప, జూలై 31(ఆంధ్రజ్యోతి): కరువుతో అల్లాడుతున్న రైతులకు కళింగర పంట కాసుల వర్షం కురిపిస్తోంది. మండలంలోని గుండ్లపల్లికి చెందిన రైతు రమేశ్ మూడు ఎకరాలలో ఈ పంట సాగు చేశాడు. బాహుబలి-2 రకం విత్తనాన్ని కిలో రూ.28 వేల ప్రకారం ఒకటిన్నర కిలోలు కొనుగోలు చేశాడు. తెగుళ్ల నివారణ, ఎరువులు తదితర వాటికి ఎకరాకు రూ.80 వేలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం మూడు ఎకరాల్లో మొదటి సారి పంట తొలగించగా 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. టన్ను రూ.12 వేలతో విక్రయించాడు. ఇంకా మిగిలిన పంటను తొలగిస్తే పెట్టుబడి పోను ఎకరాకు సుమారు రూ. లక్ష వరకు రావొచ్చునని రమేశ్ తెలిపారు. 15 రోజుల క్రితం ఒక టన్ను రూ.18 వేల వరకు ధర ఉండేదని, ఇప్పుడు వర్షాలు వస్తుండటంతో ప్రస్తుతం టన్ను రూ.12 వేలకు విక్రయించానని, లేకుంటే ఎకరాకు సుమారు రూ.2 లక్షల దాకా ఆదాయం వచ్చేదని అన్నారు.

క్రైం న్యూస్..

ఇద్దరికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాలగుత్తి సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండలకేంద్రానికి చెందిన సోమశేఖర్ యాడికి వీఆర్వో. ఇతను గురువారం బైక్‌లో యాడికి వస్తుండగా.. ముప్పాలగుత్తి గ్రామ వాసి సూరి మరో బైక్‌లో ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ వీరిని అనంతపురం తరలించారు.

బైక్, కారు ఢీ కొని..

తాడిపత్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమలి సమీపంలో వంక వద్ద గురువారం బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దవడుగూరు మండలం కొండూరు వాసి నాగేంద్రరెడ్డి, పామిడి మండలం కాలాపురం వాసి సుధాకర్‌రెడ్డి బైక్‌లో వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ ఇద్దరి కాళ్లు, చేతులు విరిగాయి. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

బొగ్గుల ఫ్యాక్టరీకి నోటీసులు

విడపనకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురం గ్రామం వద్ద అనధికారికంగా బొగ్గుల ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రజ్యోతి బుధవారం ఓ కథనాన్ని ప్రచురించిన విషయం తెల్సిందే. దీనికి మండల పరిషత్ అధికారులు ఈఓఆర్డీ సత్యబాబు, కార్యదర్శి రమేష్ స్పందించారు. బొగ్గుల ఫ్యాక్టరీ నిర్వాహకులకు గురువారం నోటీసులు జారీ చేశారు. పంచాయతీ అనుమతులు, పొల్యూషన్, ఫారెస్టు అధికారుల అనుమతులు, రెవెన్యూ అధికారుల అనుమతులు, విద్యుత్ అధికారులకు చెల్లించిన బిల్లులు.. తదితర వాటిని తీసుకురావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఆ ఫ్యాక్టరీ నుంచి వచ్చే పొగతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు కేవలం నోటీసులకే పరిమితం కాకుండా.. దాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని మాళాపురం గ్రామస్థులు కోరుతున్నారు.

మద్యం బాటిళ్లు సీజ్

పెద్దవడుగూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): భీమునిపల్లిలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అతని వద్ద ఉన్న తొమ్మిది మద్యం బాటిళ్లను సీజ్ చేశామని, కేసు నమోదు చేశామని చెప్పారు.

నందమూరి రామకృష్ణకు ఘనస్వాగతం



రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న జితేంద్రగౌడ్, నాయకులు

గుంతకల్లుటౌన్, జూలై31(ఆంధ్రజ్యోతి): ఎన్టీ రామారావు తనయుడు నందమూరి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌కు స్థానిక రైల్వే స్టేషన్‌లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ బుధవారం రాత్రి ఘనస్వాగతం పలికారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి హైదరాబాదు నుంచి గుంతకల్లు మీదుగా రైలులో వెళ్తున్న వారికి టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. ఇందులో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడ్, యువనేత అనిల్‌గౌడ్, పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేశప్ప పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత శ్రీవాణి పాఠశాల



ట్రోఫీని అందుకుంటున్న శ్రీవాణి హైస్కూల్ విద్యార్థులు

తాడిపత్రి, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన తాడిపత్రి స్కూల్స్ క్రికెట్ పోటీల్లో శ్రీవాణి హైస్కూల్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో శ్రీవాణి హైస్కూల్, గౌతం మోడ్రన్ స్కూల్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో శ్రీవాణి హైస్కూల్ జట్టు 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా బాలాజీ, ఉత్తమ బౌలర్‌గా నిఖిలేశ్వర్, ఉత్తమ ఆల్‌రౌండర్‌గా శివప్రసాద్ నిలిచారు. కౌన్సిలర్ మల్లికార్జున విజేత జట్టుకు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో తాడిపత్రి క్రికెట్ సెక్రటరీ సాధిక్‌వలి, ఆర్డీటీ కోచ్ భార్గవ్, పాఠశాల డైరెక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాయదుర్గంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేసినట్లు సూర్యవంశి శ్యానిక్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, డెర్మటాలిస్ట్ వైద్యులు జయలక్ష్మి తెలిపారు. ఇందులో ఆ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సంజయ్, సభ్యులు యశ్వంత్, శివ, సుధీర్ పాల్గొన్నారు.

నెట్టికంటి సేవలో విజిలెన్స్ ఎస్పీ



విజిలెన్స్ ఎస్పీకి ఆశీర్వచనం పలుకుతున్న అర్చకులు

గుంతకల్లు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. గురువారం దేవస్థానానికి వచ్చిన ఎస్పీకి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో నామార్చనలు చేయించి, ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు.

బదిలీ అయినా మారని పేర్లు

సమాచార హక్కు చట్టం అమలు తీరిదీ..

విడపనకల్లు, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద, గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డుల్లో బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లే నేటికీ దర్శనమిస్తున్నారు. సమాచార హక్కు చటాన్ని అధికారులు ఎంతగా అమలు చేస్తున్నారో చెప్పడానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నేం బోర్డులో అప్పిలేట్ అధికారిగా ఎంపీడీఓ శ్రీనివాసులు, సమాచార సహాయ అధికారి నారాయణ స్వామి పేర్లు ఉన్నాయి. వీరు బదిలీపై వెళ్లి సంవత్సరమైంది. అలాగే గ్రామ సచివాలయం వద్ద ఉన్న సమాచార హక్కు చట్టం బోర్డులో సమాచార అధికారిగా మహబూబ్‌బాషా, సహాయక సమాచార అధికారిగా బీ.నిఖీల్ పేర్లు ఉన్నాయి. వీరు బదిలీపై వెళ్లి మూడు నెలలైంది. అయినా వారి పేర్లు మాత్రం అలాగే ఉన్నాయి.



గ్రామ సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం వద్ద బోర్డుల్లో మార్చని అధికారుల పేర్లు